తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | సోమవారం-26- జనవరి 2026 | సంపుటి : 3 | సంచిక : 238 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



# పద్మ అవార్డులు-2026

# తెలుగు రాష్ట్రాలకు దక్కిన గౌరవం








- 2026 పద్మ అవార్డుల ప్రకటన
- పద్మవిభూషణ్ గ్రహీతలు
- పద్మభూషణ్ జాబితాలో ప్రముఖులు
- తెలుగు రాష్ట్రాలకు పద్మ పంట
- తెలంగాణకు దక్కిన గౌరవాలు
- ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికైనవారు
- క్రీడా రంగానికి పద్మశ్రీలు
- సినీ రంగ ప్రముఖులకు గుర్తింపు
- మహిళలు, మరణానంతర అవార్డులు
- రాష్ట్రపతి భవన్‌లో పురస్కార ప్రదానం

2లో



## నైనీ బొగ్గు బ్లాకు సమస్య కాదే: కిషన్‌రెడ్డి



- సింగరేణి ప్రయోజనాలకే ప్రాధాన్యం
- కొత్తగూడెం కోల్‌బెల్ట్‌లో కిషన్‌రెడ్డి పర్యటన
- బీఆర్ఎస్, కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు
- సింగరేణి ప్రైవేటీకరణ జరగదని హామీ

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

నైనీ బొగ్గు బ్లాకు అంశం పెద్ద సమస్య కాదని, దానిని పరిష్కరిస్తామని కేంద్ర బొగ్గు, గనుల శాఖమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. రాజకీయాలను పక్కన పెట్టి నైనీ విషయంలో సింగరేణి ప్రయోజనాల కోసం పని చేస్తామని చెప్పారు. నైనీ టెండర్లకు సంబంధించి ఇప్పటికే దర్యాప్తు కమిటీ వేయగా.. ఢిల్లీకి వెళ్లిన అనంతరం ఆ నివేదికను పరిశీలిస్తామన్నారు. ఆదివారం ఆయన కొత్తగూడెం కోల్‌బెల్ట్‌లో పర్యటించారు. రుద్రంపూర్‌లోని పీవీకే5 ఇంక్లైన్ గనిని సందర్శించి కార్మికులతో మాట్లాడారు. కొత్తగూడెంలోని సింగరేణి ఇల్లెందు అతిథి గృహంలో కార్మిక సంఘాల నేతలతో భేటీ అయ్యారు. అనంతరం కొత్తగూడెం క్లబ్‌లో జరిగిన బీజేపీ మునిసిపల్ ఎన్నికల విజయసంకల్ప సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు.

మిగతా 2లో

ఓటు రాజకీయ ప్రకటన మాత్రమే కాదు

## ప్రజాస్వామ్యంపై పౌరుల విశ్వాసానికి ప్రతిబింబం



- ఆకాంక్షలను వ్యక్తపరిచే సాధనం

న్యూఢిల్లీ, జనవరి 25 (తెలంగాణ ముచ్చట్లు):

జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటు ప్రాధాన్యతను విశదీకరించారు. ఓటు వేయడం కేవలం రాజకీయ ప్రకటన మాత్రమే కాదని, అది ఎన్నికల అనే ప్రజాస్వామ్య వ్యవస్థపై పౌరులకు ఉన్న విశ్వాసానికి స్పష్టమైన ప్రతి బింబమని ఆమె పేర్కొన్నారు. ఓటు ద్వారా పౌరులు తమ ఆకాంక్షలను, ఆశయాలను వ్యక్తపరుస్తారని రాష్ట్రపతి అన్నారు. ప్రజల అభిప్రాయాలు, ఆశలు ఎన్నికల ప్రక్రియ ద్వారా వెలుగులోకి వస్తాయని, ఈ విధానమే ప్రజాస్వామ్యాన్ని సజీవంగా ఉంచుతుందని ఆమె స్పష్టం చేశారు.

మిగతా 2లో




## బాధ్యతాయుత ఓటుతోనే ప్రజాస్వామ్యం బలోపేతం

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

- 'నా భారత్–నా ఓటు' థీమ్ ప్రాధాన్యం
- స్వేచ్ఛాయుత ఎన్నికలపై గవర్నర్ వ్యాఖ్యలు
- తెలంగాణలో ఎన్నికల నిర్వహణపై ప్రశంసలు
- రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య వివరాలు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

బాధ్యత, అవగాహనతో ఓటు హక్కును వినియోగించినప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థలు బలంగా నిలుస్తాయని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో 16వ జాతీయ ఓటర్ల దినోత్సవ రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

మిగతా 2లో

## ఓటే దేశ భవిష్యత్తుకు పునాది



- యువతకు ప్రధాని మోదీ పిలుపు
- యువత ప్రజాస్వామ్యంలో భాగస్వాములు కావాలి
- ఓటు హక్కు హక్కుతో పాటు బాధ్యత
- ప్రజాస్వామ్య విలువలకు నిబద్ధత అవసరం

న్యూఢిల్లీ, జనవరి 25 (తెలంగాణ ముచ్చట్లు):

దేశ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో యువత కీలక పాత్ర పోషించాలని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఓటు హక్కు వినియోగం కేవలం హక్కుగా మాత్రమే కాకుండా దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యతగా యువత భావించాలని అన్నారు. రాజ్యాంగం ఇచ్చిన గొప్ప హక్కుల్లో ఓటు హక్కు అత్యంత ముఖ్యమైందని పేర్కొన్నారు. ఓటు ద్వారానే దేశానికి దిశానిర్దేశం జరుగుతుందని ప్రధాని స్పష్టం చేశారు. దేశ అభివృద్ధి ప్రయాణంలో నిజమైన భాగ్యవిధాతలు ఓటర్లేనని వ్యాఖ్యానించారు. ప్రజలు వేసే ఓట్లకే దేశ విధిని మార్చే శక్తి ఉందని తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మై-భారత్ వాలంటీర్లకు రాసిన లేఖలో ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రజాస్వామ్య ప్రక్రియలను సమర్ధవంతంగా నిర్వహించడంలో భారత ఎన్నికల కమిషన్ చేస్తున్న కృషిని ప్రధాని అభినందించారు.

మిగతా 2లో

## ఫిబ్రవరి రెండో వారంలో మునిసిపల్ ఎన్నికలు

ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



- ఫిబ్రవరిలో పురపాలక ఎన్నికల షెడ్యూల్
- మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ధీమా
- నిజామాబాద్‌లో కాంగ్రెస్ కీలక నేతల సమావేశం
- అభివృద్ధి కార్యక్రమాలే గెలుపుకు బలం
- టికెట్ల కేటాయింపులో సర్వేల ప్రాముఖ్యం
- అందరూ కలిసి పనిచేస్తే అన్ని మునిసిపాలిటీల్లో విజయం
- పేదలకు సన్నబియ్యం అందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

8లో

## రైతు చెంతకే 'భూధార్'.. సర్వే వ్యవస్థలో విప్లవం




- పాత పద్ధతులకు స్వస్తి.. 'రోవర్స్'తో ఖచ్చిత కొలతలు
- క్షేత్రస్థాయిలో లైసెన్స్‌డ్ సర్వేయర్లు
- భూభారతి ద్వారా యాజమాన్య భద్రతకు బలమైన పునాది

2లో

## నైనీ కోల్‌బ్లాక్-మీడియా కథనాలపై సంచలన వ్యాఖ్యలు: కవిత



- తెలంగాణ జాగృతి అధికార లక్ష్యంపై కవిత ధీమా
- నైనీ కోల్‌బ్లాక్ టెండర్ రద్దుపై విమర్శలు
- హరీశ్‌రావు, కేటీఆర్‌లపై ఘాటు వ్యాఖ్యలు
- మీడియా కథనాలు–జర్నలిస్టుల అరెస్టులపై అభ్యంతరం
- మహిళలు, దళితులపై వైఖరిపై ప్రశ్నలు

2లో

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక

# పద్మ అవార్డులు-2026

# తెలుగు రాష్ట్రాలకు దక్కిన గౌరవం

హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):

గణతంత్ర దినోత్సవ వేళ కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మ అవార్డులను ప్రకటించింది. 2026 సంవత్సరానికి గాను ఆదివారం విడుదల చేసిన ఈ జాబితాలో వివిధ రంగాలకు చెందిన 131 మంది ప్రముఖులకు స్థానం దక్కింది. ఇందులో 5 పద్మవిభూషణ్, 13 పద్మభూషణ్, 113 పద్మశ్రీ పురస్కారాలు ఉన్నాయి. ఈసారి అవార్డు గ్రహీతల్లో 19 మంది మహిళలు ఉండగా, 16 మందికి మరణానంతరం పురస్కారాలు ప్రకటించారు. అలాగే విదేశీయులు, ఎన్నారైల విభాగంలో ఆరుగురు ఎంపికయ్యారు. కళలు, సామాజిక సేవ, ప్రజా వ్యవహారాలు, సైన్స్, వైద్యం, సాహిత్యం, క్రీడలు తదితర రంగాల్లో నిష్ణాతులైన వారికి పద్మ పురస్కారాలు ప్రకటించారు.



దేశానికి అసాధారణ సేవలందించినందుకు ఇచ్చే పద్మవిభూషణ్ పురస్కారం ఈసారి బాలీవుడ్ దిగ్గజ నటుడు ధర్మేంద్రసింగ్ దేవల్ (మహారాష్ట్ర), కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్.అచ్యుతానందన్‌లను మరణానంతరం వరించింది. వీరితో పాటు ప్రజా వ్యవహారాల విభాగంలో కె.టి.థామస్(కేరళ), కళల విభాగంలో ఎన్.రాజమ్(ఉత్తరప్రదేశ్), సాహిత్యం, విద్య విభాగంలో పి.నారాయణన్ (కేరళ) ఈ అత్యున్నత గౌరవానికి ఎంపికయ్యారు. ఇక విశిష్ట సేవలకు గాను ఇచ్చే పద్మభూషణ్ జాబితాలో ప్రముఖ గాయని అల్కా యాగ్నిక్, మలయాళీ నటుడు మమ్ముట్టి, మాజీ గవర్నర్ భగత్ సింగ్ కోష్యారీ, పారిశ్రామికవేత్త ఉదయ్ కోటక్, టెన్నిస్ దిగ్గజం విజయ్ అమృత్‌రాజ్, ప్రచార రంగ దిగ్గజం పియూష్ పాండే వంటి వారున్నారు.

తెలుగు రాష్ట్రాలకు ఈసారి పద్మ పురస్కారాల్లో పెద్దపీట దక్కింది. ఆంధ్రప్రదేశ్ నుంచి సీనియర్ నటుడు, మాజీ ఎంపీ మాగంటి మురళీమోహన్‌ను కళల విభాగంలో పద్మశ్రీ వరించింది. అలాగే గద్దె బాబూ రాజేంద్ర ప్రసాద్(కళలు), మరణానంతరం గరిమెళ్ళ బాలకృష్ణ ప్రసాద్(కళలు), వెంపటి కుటుంబ శాస్త్రి(సాహిత్యం) ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికయ్యారు. తెలంగాణ నుంచి ప్రముఖ కూచిపూడి నృత్యకారిణి దీపికారెడ్డి (కళలు), వైద్య రంగంలో గూడూరు వెంకటరావు, పాల్కొండ విజయ్‌ఆనంద్‌రెడ్డి పద్మశ్రీ అందుకోనున్నారు. సైన్స్ రంగంలో చంద్రమౌళి గడ్డమణుగు, కృష్ణమూర్తి బాలసుబ్రమణియన్, కుమారస్వామి తంగరాజ్, పశు సంవర్ధక విభాగంలో రామారెడ్డి మామిడి (మరణానంతరం) తెలంగాణ కీర్తిని ఇనుమడింపజేశారు. అలాగే.. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) మాజీ చైర్మన్, తెలంగాణలోని నల్గొండ జిల్లాకు చెందిన మామిడాల జగదీశ్ కుమార్ సాహిత్యం, విద్యా రంగంలో పద్మశ్రీ వరించింది.

క్రీడా, సినీ రంగాలకు చెందిన పలువురు ఇతర ప్రముఖులకు కూడా పద్మశ్రీ దక్కింది. టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ, మహిళా క్రికెటర్ హర్మన్‌ప్రీత్ కౌర్ భుల్లర్, హాకీ క్రీడాకారిణి సవితా పునియాలను పద్మశ్రీ వరించింది. సినీ రంగం నుంచి బెంగాలీ నటుడు ప్రోసెన్‌జిత్ ఛటర్జీ, మరణానంతరం నటుడు సతీష్‌షా, అనిల్ కుమార్ రస్తోగి ఈ జాబితాలో ఉన్నారు. మార్చి లేదా ఏప్రిల్‌లో రాష్ట్రపతి భవన్‌లో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి చేతుల మీదుగా వీరు పురస్కారాలు అందుకోనున్నారు.

# నైనీ బొగ్గు బ్లాకు సమస్య కాదే: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

బీఆర్ఎస్, కాంగ్రెస్ సింగరేణి కార్మికుల రక్తం తాగుతున్నాయని మండిపడ్డారు. కేసీఆర్ కుటుంబమంతా సింగరేణిని దోచుకుందని ఆరోపించారు. బ్యాంకుల నుంచి అప్పు తెచ్చి కార్మికులకు జీతాలిచ్చే పరిస్థితికి కేసీఆర్ అవినీతి పాలనే కారణమని విమర్శించారు. ఫుట్‌బాల్ ఆటగాడు మెస్సీ వస్తే రూ.10 కోట్లు సింగరేణి నుంచి ఖర్చు పెట్టారని, ఫుట్‌బాల్‌కు సింగరేణికి ఏం సంబంధమని ప్రశ్నించారు. సంస్థకు చెందిన రూ.51 కోట్లను ప్రభుత్వం వాడుకొని తిరిగి ఇవ్వకపోవడంతో సింగరేణి ఆర్థిక సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. సింగరేణి ప్రైవేటీకరణ జరుగుతోందని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అది ఎప్పటికీ జరగదని కిషన్‌రెడ్డి అన్నారు. సింగరేణిలో ఖర్చు తగ్గించుకుని, ఉత్పత్తిని పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. 35వేల మంది కాంట్రాక్టు కార్మికుల జీతాలు పెంచడంతోపాటు, సింగరేణికి రావాల్సిన బకాయిల వసూళ్ల విషయంపై ముఖ్యమంత్రికి లేఖ రాస్తానని హామీ ఇచ్చారు. కాగా, ఖమ్మం ఎంపీ రఘురామ రెడ్డి కొత్తగూడెంలో విమానాశ్రయ ఏర్పాటు అంశంపై కిషన్‌రెడ్డితో చర్చించారు. కోల్ ఇండియా తరహా వేతన చట్టాన్ని అమలు చేయాలని కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎక్కడికక్కడ తెలంగాణను దోచుకున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు. దోచుకున్నసొమ్మును పంచుకునేందుకు కొట్లాడుకుంటూ కేసీఆర్‌కుటుంబం రోడ్డున పడిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ సైతం బీఆర్ఎస్ మాదిరిగా ఎక్కడపడితే అక్కడ దోచుకుంటోందని విమర్శించారు.



# నైనీ కోల్‌బ్లాక్-మీడియా కథనాలపై సంచలన వ్యాఖ్యలు: కవిత

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

రాష్ట్రంలో బలమైన రాజకీయ పార్టీగా జాగృతి ఎదగబోతోందని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణ జాగృతి అధికారంలోకి వస్తుందని అధ్యక్షురాలు కవిత అన్నారు. ఆదివారం ఆమె బంజారాహిల్స్‌లో మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. నైనీ కోల్ బ్లాక్ టెండర్ రద్దుపై స్పందిస్తూ.. హరీశ్ రావుపై షాకింగ్ కామెంట్స్ చేశారు. హరీష్ రావును గుంట నక్క అని, గుంటనక్కను చూసి గుడ్డిగా కేటీఆర్ ప్రెస్ మీట్ పెట్టాడని విమర్శించారు. గతంలో హరీశ్ రావు మంత్రిగా ఉన్నప్పుడే సృజన్ రెడ్డికి కాంట్రాక్టులు అప్పజెప్పాడన్నారు. అప్పుడు రేవంత్ రెడ్డి బావమరిది అని గుర్తుకురాలేదా అని మండిపడ్డారు. సింగరేణి విషయంలో బీఆర్ఎస్ డొల్లతనాన్ని మేం గమనిస్తున్నామని, కేటీఆర్ పై కథనం వస్తే ఒక నీతి? దళిత మహిళపై కథనం వస్తే ఒక నీతా? కవిత ప్రశ్నించారు. ''మన రాష్ట్రంలో ఇప్పుడు దారుణమైన ట్రెండ్ స్టార్ట్ అయ్యింది. మోస్ట్ అన్ పాపులర్ యూట్యూబ్ ఛానెల్ లో కథనాలు వేసినట్లు శాటిలైట్ ఛానెన్‌లో కథనాలు వేస్తున్నారు. దళిత ఆడబిడ్డల మీద అలాంటి కథనాలు వేయటంపై మేం ఎంతో బాధపడ్డాం. గతంలో లైన్ అతిక్రమించిన యూట్యూబ్ ఛానెల్ వాళ్లను బీఆర్ఎస్ ప్రభుత్వం అరెస్ట్ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక అడుగు ముందుకు వేసి లైన్ అతిక్రమించిన శాటిలైట్ ఛానెల్ ప్రతినిధులను కూడా అరెస్ట్ చేసింది. జర్నలిస్టులను అరెస్ట్ చేసిన తీరును మేం ఖండిస్తున్నాం. వాళ్లేమీ టెర్రరిస్టులు కాదు. వాళ్లకు నోటీసులు ఇచ్చి వివరణ అడగాల్సింది. ఈ అవకాశాన్ని వినియోగించుకొని బీఆర్ఎస్ పార్టీ జర్నలిస్టులకు సపోర్ట్‌గా నిలిచింది. కానీ కేటీఆర్ మీద ఇలాంటే కథనాలే వస్తే ఆయన అనుచరులు ఒక ఛానెల్ పై దాడి చేశారు. అక్కడ మహిళపై కథనాలు వేస్తే దాడి...ఇక్కడ మహిళలపై కథనాలు వస్తే జర్నలిస్టులకు సపోర్ట్ చేస్తారా?'' కవిత ప్రశ్నించారు.

''మహిళల విషయంలో ఇదేనా మీ వైఖరి అని నేను కేటీఆర్‌ను ప్రశ్నిస్తున్నా. ఒక దళిత బిడ్డపై కథనాలు వస్తే ఆమెకు అండగా ఉండకపోవటాన్ని ప్రజలు గుర్తించాలి. ఆ ఛానెల్‌లో కథనం తర్వాత ఆ కథనం బ్యాక్ గ్రౌండ్ అంటూ ఇంకొక పేపర్‌లో కథనం వచ్చింది. ఆ కథనం ఆధారంగా భట్టి విక్రమార్క ప్రెస్ మీట్ పెట్టారు. భట్టి ప్రెస్ మీట్ పెట్టగానే మా గుంటనక్క కూడా ప్రెస్ మీట్ పెట్టారు. గుంటనక్క ప్రెస్ మీట్ ను గుడ్డిగా ఫాలో అయి కేటీఆర్ ఒక ప్రెస్ మీట్ పెట్టారు. మొత్తానికి నైనీ కాంట్రాక్ట్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అయితే ఇక్కడ విచిత్రాలు జరుగుతున్నాయి'' అని కవిత అన్నారు.



# బాధ్యతాయుత ఓటుతోనే ప్రజాస్వామ్యం బలోపేతం

(మొదటి పేజీ తరువాయి)

ఈ ఏడాది థీమ్ ''నా భారత్ నా ఓటు'' పౌరులే భారత ప్రజాస్వామ్యానికి కేంద్ర బిందువని స్పష్టంగా తెలియచేస్తుందని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం భారత ఎన్నికల సంఘానికి కల్పించిన స్వతంత్రత, నిష్పక్షపాతమైన స్వేచ్ఛాయుత, న్యాయసమ్మతం ఎన్నికలకు పునాది అన్నారు. అంబేద్కర్, మహాత్మాగాంధీ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ సామాజిక ప్రజాస్వామ్యం లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యం నిలవదని పేర్కొన్నారు. తెలంగాణలో ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు, అర్హులైన ఓటర్లకు హోం ఓటింగ్, ఆధునిక సాంకేతిక వినియోగం ద్వారా ఎన్నికలు మరింత సమగ్రంగా మారాయని ప్రశంసించారు. జూబ్లీహిల్స్ (61) అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికను డ్రోన్ నిఘా, పోలీసు సమన్వయంతో ప్రశాంతంగా నిర్వహించిన తీరును ఆయన అభినందించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సి.సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం 3.39 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఇందుకోసం 35,895 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లలో 1.68 కోట్ల మంది పురుషులు, 1.70 కోట్ల మంది మహిళలు, 2890 మంది ట్రాన్స్‌జెండర్‌లు ఉన్నారని చెప్పారు. గత జాతీయ ఓటర్ల దినోత్సవం నుంచి ఇప్పటివరకు సుమారు 3.93 లక్షల మంది కొత్త ఓటర్ల జాబితాలో చేరినట్లు ఆయన వెల్లడించారు. ఓటరు జాబితా సవరణ లక్ష్యం నిజమైన ఓటర్ల తొలగింపు కాదని, రెండు చోట్ల ఉన్న ఓటర్లు, అనర్హులను తొలగించడమేనని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణికుముదిని, అదనపు సీఈవో వాసం వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఓటే దేశ భవిష్యత్తుకు పునాది

(మొదటి పేజీ తరువాయి)



దేశవ్యాప్తంగా ఎన్నికలను నిబద్ధతతో, పారదర్శకంగా నిర్వహిస్తున్నందుకు ఈసీని ప్రశంసించారు. ఎన్నికల సమయంలో ఇతర ప్రాంతాల్లో ఉన్నవారు కూడా తమ స్వస్థలాలకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకుంటున్నారని గుర్తు చేశారు. హిమాలయాల్లో, అండమాన్ దీవుల్లో, దట్టమైన అడవుల్లో నివసిస్తున్నవారు సైతం ఎన్నికల వేళ స్వగ్రామాలకు చేరుకుని ఓటు వేస్తున్నారని మోదీ పేర్కొన్నారు. ఇది ప్రజాస్వామ్య విలువల పట్ల భారతీయుల నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. రాబోయే తరాలు కూడా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. అదే సమయంలో దేశ అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రజాస్వామ్యంలో మహిళల చురుకైన పాత్ర భారత్‌ను మరింత ముందుకు నడిపిస్తుందని ప్రధాని అభిప్రాయపడ్డారు.

## ఓటు రాజకీయ ప్రకటన మాత్రమే కాదు

# ప్రజాస్వామ్యంపై పౌరుల విశ్వాసానికి ప్రతిబింబం

(మొదటి పేజీ తరువాయి)



ప్రజాస్వామ్యానికి మూలాధారం ప్రజల భాగస్వామ్యమేనని ద్రౌపది ముర్ము గుర్తుచేశారు. ప్రతి పౌరుడు తన ఓటు హక్కును బాధ్యతతో వినియోగించుకోవడం ద్వారా దేశ భవిష్యత్తు రూపకల్పనలో భాగస్వామి అవుతాడని వ్యాఖ్యానించారు. ఎన్నికల పట్ల ప్రజల్లో ఉన్న నమ్మకం దేశానికి బలమైన ప్రజాస్వామ్య పునాదిగా నిలుస్తుందని అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం వంటి కార్యక్రమాలు ప్రజల్లో అవగాహన పెంచేందుకు, ప్రజాస్వామ్య విలువలను మరింత బలోపేతం చేయడానికి దోహదపడతాయని రాష్ట్రపతి అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా యువత తమ ఓటు హక్కు ప్రాముఖ్యతను గుర్తించి చురుకుగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు.

# రైతు చెంతకే 'భూధార్'.. సర్వే వ్యవస్థలో విప్లవం

ఖమ్మం, జనవరి 25 (తెలంగాణ ముచ్చట్లు):



రైతుల భూములకు సంబంధించిన ప్రతి అంగుళాన్ని డిజిటలైజ్ చేసి శాశ్వత యాజమాన్య భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం 'ధరణి' ద్వారా సృష్టించిన చిక్కుముడులను విప్పుతూ రైతులకు చుట్టంలా ఉండేలా 'భూభారతి' చట్టాన్ని అమలులోకి తెచ్చామని తెలిపారు. ఈ నేపథ్యంలో ఖమ్మం కలెక్టరేట్ (ఐడీఓసీ)లో శిక్షణ పూర్తి చేసుకున్న లైసెన్స్‌డ్ సర్వేయర్లకు లైసెన్సులు అందజేశారు. భూ సర్వేలో గతంలోని టేపులు, గొలుసుల పద్ధతులకు స్వస్తి పలికి సెంటీమీటర్ల స్థాయిలో ఖచ్చితత్వం వచ్చేలా ఆధునిక 'రోవర్స్' సాంకేతికతను వినియోగిస్తున్నామని మంత్రి వివరించారు. ఇప్పటికే 600 రోవర్లను కొనుగోలు చేసి జిల్లాలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ పొందిన 5,500 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను మండలాల వారీగా భూ విస్తీర్ణం ప్రాతిపదికన కేటాయించామని, ఖమ్మం జిల్లాలో రెండో విడతలో అర్హత సాధించిన 47 మందికి నియామక పత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు. గత పాలకులు తీసుకొచ్చిన ధరణిలో జరిగిన లోపాలపై సిరిసిల్ల, సిద్ధిపేట జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్ పూర్తయ్యిందని, ఆ నివేదికలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని మంత్రి తెలిపారు. త్వరలో మిగిలిన 31 జిల్లాల్లోనూ ఆడిట్ నిర్వహిస్తామని చెప్పారు. రిజిస్ట్రేషన్ల విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదని, భూభారతి పై బురద చల్లే ప్రయత్నాలను ప్రభుత్వం తిప్పికొడుతుందని స్పష్టం చేశారు.

ధరణి లొసుగులను ఆసరాగా చేసుకుని అక్రమాలకు పాల్పడిన వారిని ఎంతటి వారైనా ఉపేక్షించబోమని, క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరంగా శిక్షిస్తామని మంత్రి హెచ్చరించారు. రైతులు, భూ యజమానులకు రక్షణ కల్పించేందుకు భూభారతి పోర్టల్ ద్వారా భూ రికార్డుల భద్రత బాధ్యతను కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ కు అప్పగించినట్లు తెలిపారు. త్వరలో ఈ వెబ్ పోర్టల్ ప్రజలకు అందుబాటులోకి రానుందని వెల్లడించారు.

ఇదే సందర్భంగా హైదరాబాద్ నాంపల్లి అగ్నిప్రమాద ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తామని భరోసా ఇచ్చారు.



# బంజారా ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఎంపీ కడియం కావ్య





## బంజారా గోత్ర క్యాలెండర్ ఆవిష్కరణ

**హనుమకొండ,జనవరి25(తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ బస్టాండ్ సమీపంలోని శ్రీహర్ష కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా బంజారా ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బంజారా గోత్ర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. విద్య, ఉపాధి, ఆరోగ్యం రంగాల్లో బంజారా సమాజం మరింత ముందుకు రావాలని ఆకాంక్షించారు. తరతరాలుగా బంజారా సమాజం తన ప్రత్యేక భాష, వేషధారణ, నృత్యాలు, పండుగలు, ఆచార సంప్రదాయాలను కాపాడుకుంటూ సాగడం అభినందనీయమని పేర్కొన్నారు.

బంజారా గోత్ర క్యాలెండర్ ఆవిష్కరణ ద్వారా యువతకు బంజారా సంస్కృతి, చరిత్రపై అవగాహన పెరుగుతుందని, ఇది గిరిజన వారసత్వాన్ని రాబోయే తరాలకు అందించే మంచి ప్రయత్నమని అన్నారు. సామాజిక ఐక్యత, పరస్పర గౌరవం, సాంస్కృతిక విలువలే దేశ బలమని పేర్కొంటూ, ఇలాంటి ఆత్మీయ సమ్మేళనాలు సమాజాన్ని ఏకం చేసే వేదికలుగా నిలుస్తాయని తెలిపారు. బంజారా సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. హనుమకొండలోని గిరిజన భవన అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పోరిక వీరన్న నాయక్, సంగెం మాజీ జెడ్పిటిసి వీరమ్మ, రిటైర్డ్ డీఈఓ జవహర్ లాల్ నాయక్, డీఎంహెచ్ఓ రవిరాథోడ్, రిటైర్డ్ ఆర్జేడీ వెంకట్రాం, భోజ్ నాయక్, డాక్టర్ రమేష్‌నాయక్, వెంకట్ నాయక్, సర్పంచ్ బానోతు అరుణ రాజేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అపార్ట్మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరించిన ఎంపీ కడియం కావ్య





**హనుమకొండ,జనవరి25(తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ హంటర్ రోడ్‌లోని ఆకృతి అపార్ట్ మెంట్స్‌లో నిర్వహించిన అపార్ట్మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 2026 నూతన డైరీని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ, అపార్ట్మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లు సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. నివాస ప్రాంతాల్లో పరిశుభ్రత, భద్రత, పరస్పర సహకారం పెంపొందించడంలో అసోసియేషన్‌ల సేవలు అభినందనీయమని తెలిపారు. అపార్ట్మెంట్లలో నివసిస్తే మంచి సౌకర్యాలు లభిస్తాయనే భావన ప్రజల్లో మరింత బలపడాలని అన్నారు.

అపార్ట్మెంట్ వాసులు ఒక కుటుంబ సభ్యుల్లా కలిసి జీవిస్తూ సాంస్కృతిక సంప్రదాయాలను కొనసాగిస్తూ పండుగలు జరుపుకోవడం శుభ పరిణామమని చెప్పారు. గతంలో పక్కన నివసించే వారి పరిచయం కూడా లేకుండా ఉండే పరిస్థితులు ఉండేవని, అయితే ప్రస్తుతం అపార్ట్మెంట్ సంస్కృతి మారి, అందరూ కలిసి ప్రతి పండుగను వైభవంగా జరుపుకుంటున్నారని తెలిపారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని, ఆరోగ్యమే నిజమైన సంపద అని పేర్కొన్నారు.

అపార్ట్మెంట్ వాసులు పరస్పరం సహకరించుకుంటూ ఐక్యతతో ముందుకు సాగాలని సూచించారు. అపార్ట్మెంట్లకు సంబంధించిన ప్రధాన సమస్యల పరిష్కారానికి తాను ముందుండి కృషి చేస్తానని, ముఖ్యంగా వాటర్ లైన్ వంటి మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎంపీ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అపార్ట్మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కేశవరెడ్డి, జనరల్ సెక్రటరీ ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్, ట్రెజరర్ రాజ్ కుమార్, అపార్ట్మెంట్ సభ్యులు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# ఏదులాపురానికి 'ఆదర్శ' హంగులు





- రూ. 1.32 కోట్లతో అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి శ్రీకారం
- ఏప్రిల్ నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు
- లబ్ధిదారులకు రాజకీయాలకు అతీతంగా ప్రాధాన్యం

**ఖమ్మం బ్యూరో, జనవరి 25(తెలంగాణ ముచ్చట్లు):** ఏదులాపురం మున్సిపాలిటీని అన్ని వసతులతో కూడిన ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ఆయన జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి పట్టణంలో పర్యటించి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.

### మౌలిక వసతులే లక్ష్యం

పట్టణంలోని వివిధ వార్డుల్లో సుమారు రూ. 1.32 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు మంత్రి భూమిపూజ చేశారు. చైతన్య నగర్, ఆర్ఎస్ నగర్, కేబీఆర్ నగర్, తెల్దారుపల్లి ప్రాంతాల్లో ఈ పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండేళ్లలో ఏదులాపురం పరిధిలో రూ. 57 కోట్లతో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచినట్లు వెల్లడించారు. జంక్షన్ల అభివృద్ధి ద్వారా పట్టణ ముఖచిత్రాన్ని మారుస్తామని భరోసా ఇచ్చారు.

### ఏప్రిల్ నుంచి మరో విడత ఇండ్లు

పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. "ఇప్పటికే మొదటి విడతలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశాం. ఏప్రిల్ నుంచి రెండో విడత ఇళ్ల మంజూరు ప్రక్రియ ప్రారంభిస్తాం" అని ప్రకటించారు. రాజకీయాలకు తావులేకుండా, కేవలం అర్హతే ప్రాతిపదికన లబ్ధిదారులను ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు. ఇంటి నిర్మాణ పురోగతిని బట్టి ప్రతి సోమవారం నిధులు విడుదల చేస్తున్నట్లు వివరించారు.

### మహిళా సాధికారతకు ప్రాధాన్యం

'ఇందిరా మహిళా శక్తి'లో భాగంగా ఆర్ఎస్ నగర్‌లో 37 మంది ముస్లిం మైనారిటీ మహిళలకు మంత్రి కుట్టు మిషన్లను అందజేశారు. స్వయం ఉపాధి ద్వారా మహిళలు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. అలాగే విద్యార్థుల సంక్షేమం కోసం గురుకులాల్లో డైట్, కాస్మోటిక్ చార్జీలను భారీగా పెంచినట్లు గుర్తుచేశారు. ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణీ వంటి పథకాలు పేదల జీవన ప్రమాణాలను పెంచుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఏదులాపురాన్ని రోడ్లు, డ్రైన్లు, పార్కులతో కూడిన 'రోల్ మోడల్' పట్టణంగా మార్చే బాధ్యతను తానే తీసుకుంటున్నట్లు మంత్రి పునరుద్ఘాటించారు.

# వెల్టూర్ అభివృద్ధికి ఎమ్మెల్యే మేఘా రెడ్డి హామీ



- మండల కేంద్రం అంశంపై సీఎం దృష్టికి ఫైల్ తీసుకెళ్తామని స్పష్టం

**పెద్దమందడి,జనవరి25(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం పరిధిలోని వెల్టూర్ గ్రామ అభివృద్ధి కోసం గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎమ్మెల్యే మేఘా రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెల్టూర్ గ్రామానికి సంబంధించిన పలు కీలక అభివృద్ధి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటిస్తే పరిసర గ్రామాలకు పరిపాలనా సౌకర్యాలు మెరుగుపడతాయని నాయకులు వివరించారు.అలాగే వెల్టూర్ నుంచి సోలిపూర్ వరకు బీటి రోడ్డును విస్తరించి బలపర్చాలని, రవాణా సౌకర్యాల మెరుగుదల కోసం గ్రామ సమీపంలో ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు చేయాలని కోరారు. గ్రామ ప్రజలకు బ్యాంకింగ్ సౌకర్యాలు అందుబాటులోకి రావాలనే ఉద్దేశంతో మినీ బ్యాంకు ఏర్పాటు చేయాలని కూడా వినతిపత్రం ద్వారా అభ్యర్థించారు.ఈ అన్ని అంశాలపై ఎమ్మెల్యే మేఘా రెడ్డి సానుకూలంగా స్పందించారు. కొత్త మండలాల ఏర్పాటు సంబంధిత ఫైల్‌ను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తగిన నిర్ణయం తీసుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే రోడ్లు, రవాణా, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.వెల్టూర్ గ్రామ అభివృద్ధి కోసం అవసరమైన చర్యలు దశలవారీగా చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ సర్పంచ్ అభ్యర్థి వడ్డె శేఖర్, బిజెపి మాజీ మండల అధ్యక్షుడు రమేష్, తిరుపతయ్య, దాసరి కురుమన్న తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారికి బాలమిత్ర అవార్డు ప్రదానం



**భీమదేవరపల్లి, జనవరి 25 (తెలంగాణ ముచ్చట్లు):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామానికి చెందిన కుమారి గోలేన శ్రీనిధికి కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ కనబరిచినందుకు రాష్ట్రస్థాయి బాలమిత్ర అవార్డు ప్రదానం చేశారు. బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్రస్థాయి సిల్వర్, గోల్డ్ అవార్డు గ్రహీత వలస సుభాష్ చంద్రబోస్ తన తండ్రి వలస శంకరయ్య జ్ఞాపకార్థంగా ఈ అవార్డును అందజేశారు.

ఈ సందర్భంగా వలస సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ, చిన్నారికి రాష్ట్రస్థాయిలో బాలమిత్ర అవార్డు అందించడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడలు, కళలు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. చిన్నతనం నుంచే క్రీడలపై శ్రద్ధ, చదువుపై దృష్టి ఉంటే వివేకం పెరుగుతుందని అన్నారు. మంచి మార్కులు సాధించి సమాజంలో విలువైన వ్యక్తులుగా ఎదగాలంటే స్పష్టమైన లక్ష్యంతో నిరంతరంగా శ్రమించాలని విద్యార్థిని ప్రోత్సహించారు.

బాలల హక్కుల ప్రజా వేదిక గత రెండు దశాబ్దాలుగా బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నిర్మూలన కోసం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం అవార్డు గ్రహీతను శాలువాతో సన్మానించి, అవార్డు సర్టిఫికెట్ అందజేశారు.ఈ కార్యక్రమంలో కిక్ బాక్సింగ్ కోచ్ సిరిగిరి సాంబశివ, పుష్కరిణి వ్యవస్థాపక అధ్యక్షులు సంఘ శ్రీధర్, చిన్నారి తల్లిదండ్రులు రాజు, బాలమణి, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**పెద్దమందరం,జనవరి25(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామంలో సీఎం రిలీఫ్ ఫండ్‌కు సంబంధించిన చెక్కులను బాధిత కుటుంబాలకు పంపిణీ చేశారు. మణిగిల్ల కాంగ్రెస్ పార్టీ కంటెస్టడ్ సర్పంచ్ అభ్యర్థి శివ యాదవ్ నాయకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామానికి చెందిన వడ్డే రమేష్ (తండ్రి: వడ్డే సత్తి), తెలుగు రంగమ్మ (భర్త: శర్మ), కావలి శివానిలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు.బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, వనపర్తి నియోజకవర్గ ముద్దుబిడ్డ ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సౌజన్యంతో ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, వార్డు సభ్యులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# రైతు చెంతకే 'భూధార్'.. సర్వే వ్యవస్థలో విప్లవం






- క్షేత్రస్థాయిలోకి లైసెన్స్‌డ్ సర్వేయర్లు
- పాత పద్ధతులకు స్వస్తి.. ఆధునిక 'రోవర్స్'తో కొలతలు
- తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి

**ఖమ్మం బ్యూరో, జనవరి 25(తెలంగాణ ముచ్చట్లు):** భూములకు సంబంధించి ప్రతి అంగుళాన్ని డిజిటలైజ్ చేసి, యజమానులకు శాశ్వత యాజమాన్య భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం 'ధరణి' ద్వారా సృష్టించిన చిక్కుముడులను విప్పుతూ.. రైతులకు చుట్టంలా ఉండేలా 'భూభారతి' చట్టాన్ని అమలులోకి తెచ్చామని ఆయన వెల్లడించారు. ఆదివారం ఖమ్మం కలెక్టరేట్ (ఐడీఓసీ)లో శిక్షణ పూర్తి చేసుకున్న లైసెన్స్‌డ్ సర్వేయర్లకు ఆయన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

అందుబాటులోకి అత్యాధునిక సాంకేతికత

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "గతంలోని టేపులు, గొలుసుల పద్ధతులకు స్వస్తి పలికి, సెంటీమీటర్ల తేడాతో ఖచ్చితత్వం వచ్చేలా 'రోవర్స్' సాంకేతికతను వాడుతున్నాం. ఇప్పటికే 600 రోవర్లను కొనుగోలు చేసి జిల్లాలకు పంపిణీ చేస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ పొందిన 5,500 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను మండలాల వారీగా భూ విస్తీర్ణం ప్రాతిపదికన కేటాయించాం" అని వివరించారు. ఖమ్మం జిల్లాలో రెండో విడతలో అర్హత సాధించిన 47 మందికి నియామక పత్రాలు అందజేశామని, వీరంతా పారదర్శకతతో పనిచేయాలని సూచించారు.

ధరణి అక్రమాలపై ఉక్కుపాదం

ధరణిలో జరిగిన లోపాలపై ఇప్పటికే సిరిసిల్ల, సిద్ధిపేట జిల్లాల్లో ఫోరెన్సిక్ ఆడిట్ పూర్తి చేశామని, ఆ నివేదికలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని మంత్రి తెలిపారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన 31 జిల్లాల్లోనూ ఆడిట్ నిర్వహిస్తామన్నారు. రిజిస్ట్రేషన్ల విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శల్లో వాస్తవం లేదని, ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

హైదరాబాద్ నాంపల్లి అగ్నిప్రమాద ఘటనపై మంత్రి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విదేశీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి బాధితులకు అండగా ఉండాలని ఆదేశించారన్నారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుందని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**నాచారం, జనవరి 25 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని నాచారం సర్కిల్ మీర్పేట్ హెచ్‌బీ కాలనీలో అపోలో ఫార్మసీ ఆధ్వర్యంలో లక్ష్మీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు ఆరోగ్యమే ప్రధానమని పేర్కొంటూ, ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ హెల్త్ క్యాంప్‌లో బీపీ, షుగర్, దంత పరీక్షలు, కంటి పరీక్షలు, లివర్ ఫంక్షన్ టెస్టులు, లంగ్స్ ఫంక్షన్ టెస్టులు, దర్మటాలజీతో పాటు ఫుల్ బాడీ చెకప్‌కు సంబంధించిన అన్ని పరీక్షలను పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ వైద్య శిబిరంలో జనరల్ ఫిజీషియన్ డాక్టర్ అమీర, కార్డియాలజిస్ట్ డాక్టర్ సునీల్ మాథ్యూ, డెర్మటాలజిస్ట్ డాక్టర్ దివ్య, ఆర్థోపెడిక్ నిపుణుడు డాక్టర్ సుధాకర్ రెడ్డి, డెంటిస్ట్ డాక్టర్ నిషితతో పాటు వారి వైద్య సిబ్బంది సేవలందించారు.కార్యక్రమంలో కుషాయిగూడ ఎస్ఐ సతీష్, వంజరి ప్రవీణ్ కరిపే, కాలనీ అధ్యక్షుడు రామ్మోహన్ రావు, బాల్ రెడ్డి, సుబ్బారెడ్డి, కోటిరెడ్డి, కామేశ్వర రావు, రామ్ రెడ్డి, ఖాన్, ముత్యారావు, నర్సింగ్ రావు, చక్రవర్తి, వెంకటేశ్వర రావు, మాధవ రావు, సత్యనారాయణ, వెంకట రాముడు తదితర కాలనీ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





# ఉత్సాహంగా సీఎం కప్ పోటీలు

- మధిరలో మస్తు జోష్ గా పోటీలు

**ఖమ్మం బ్యూరో, జనవరి 25(తెలంగాణ ముచ్చట్లు):** రెండవ విడత సీఎం కప్ పోటీలో భాగంగా ఆదివారం ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం లో పలు గ్రామ క్లస్టర్లలో ఉత్సాహంగా క్రీడా పోటీలు జరిగాయి. మధిర నియోజకవర్గం లో మధిర పట్టణం, ఎర్రుపాలెం, చింతకాని మండలం కొదుమూరు కేంద్రాల్లో మొదటి అంచె గ్రామీణ క్లస్టర్ పోటీలు నిర్వహించారు. మధిరలో జరిగిన పోటీలను జిల్లా యువజన సంక్షేమ అధికారి తుంబూరు సునీల్ రెడ్డి, స్థానిక మున్సిపల్ కమిషనర్ సంపత్, తాసిల్దారు రాళ్ల బండి రాంబాబు, ఎంఈఓ ప్రభాకర్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేంరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మిరియాల రమణ గుప్తా లు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా క్రీడలు యువజన సంక్షేమ అధికారి సునీల్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ క్రీడా శాఖ ఆధ్వర్యంలో 5అంచల్లో గ్రామీణ మండల అసెంబ్లీ నియోజకవర్గం జిల్లా రాష్ట్రస్థాయిలో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ పోటీలు నిర్వహిస్తుందని ఇందు కొరకు ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాకారులను గ్రామీణ క్లస్టర్ స్థాయి నుండి మండల స్థాయి నియోజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహించాక జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామని వివరించారు. జిల్లా స్థాయి పోటీలు అనంతరం వారిని రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపిక చేస్తామని, మరియు గ్రామా స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ప్రతిభ చూపిన క్రీడాకారులను గుర్తించి వారికి ఇంకా మెరుగైన శిక్షణ, సౌకర్యాలు కల్పించి ఒలంపిక్ స్థాయి క్రీడాకారులను తయారుచేయడానికి స్పోర్ట్స్ అథారిటీ అఫ్ తెలంగాణ సిద్ధంగా వున్నదని ఆయన తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా యువ క్రీడాకారుల్లో మంచి స్పందన లభిస్తుందని, జిల్లా కలెక్టర్ మరియు జిల్లా అధికారుల సహకారంతోవారి క్రీడా ప్రతిభను ప్రోత్సహించే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలోస్పోర్ట్స్ అథారిటీ అధికారి రాజ్ వీర్,ప్రజా సంబంధాల అధికారి సురేష్, ఎస్ జి ఎఫ్ జిల్లా సంయుక్త కార్యదర్శి చిన్ని ఫిసికల్ డైరెక్టర్లు చైతన్య రవి నరసింహారావు సైదులు, స్పోర్ట్స్ అథారిటీ కోచులు గౌస్ దీపక్ శ్రీనివాస్ సోహెల్ నిరీక్షన్, సునీల్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి విరాళం



**పెద్దమందడి,జనవరి25(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 8వ వార్డు మెంబర్ జంగం శివ రూ.5,000/రూపాయల విలువైన విద్యా సామగ్రిని విరాళంగా అందజేశారు.ఈ విరాళంలో విద్యార్థులకు అవసరమైన ప్యాడ్లు, పలకలు, నోట్ బుక్స్, పెన్నులు, బలపాలు తదితర విద్యా సామగ్రి ఉన్నాయి.విద్యార్థుల చదువుకు ఉపయుక్తంగా ఉండే విధంగా ఈ సామగ్రిని అందించడం ఎంతో అభినందనీయమని గ్రామస్తులు తెలిపారు.గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రేపు ఉదయం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఈ విద్యా సామగ్రిని విద్యార్థులకు అధికారికంగా పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా జంగం శివ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు నాణ్యమైన విద్య పొందాలంటే అవసరమైన మౌలిక వసతులు, విద్యా సామగ్రి అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా విద్యార్థుల సంక్షేమానికి తన వంతు సహకారం కొనసాగిస్తానని ఆయన అన్నారు.ఈ కార్యక్రమానికి పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు తదితరులు హాజరుకానున్నారు.

# కాజీపేట రైల్వే స్టేడియంలో మేడారం బస్‌లు ప్రారంభం




**కాజీపేట్ జనవరి 25 తెలంగాణ ముచ్చట్లు :** ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజనుల జాతర అయినటువంటి మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వివిధ ప్రాంతాల నుండి కాజీపేట రైల్వే జంక్షన్ కు వచ్చే ప్రయాణికులతో పాటు కాజీపేట్ చుట్టుపక్కల గ్రామాల ప్రజల సౌకర్యార్థం టీజీఎస్ ఆర్టిసి వరంగల్ 2 డిపో వారిచే కాజీపేట జంక్షన్ ముందున్న రైల్వే స్టేడియంలో ఆదివారం బస్ ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లే ప్రయాణికుల కోసం బస్సులను ఆపరేట్ చేసే ఇటువంటి క్యాంపును డిపో మేనేజర్ ఎం రవిచంద్ర అధ్యక్షతన కాజీపేట సీఐ ఎం సుధాకర్ రెడ్డి, ఎస్సై నవీన్ కుమార్ కాజీపేట రైల్వే స్టేడియం ఇన్చార్జ్ ఎస్సీ రైల్వే జర్నల్ ఇన్స్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ రవిచందర్ మాట్లాడుతూ ఇట్టి అవకాశాన్ని కాజీపేట చుట్టుపక్కల గ్రామాల ప్రజలు లతోపాటు రైల్వే స్పెషల్ రైళ్లు వేసిన కారణంగా హనుమకొండ బస్టాండ్ వెళ్లకుండా రైలు ప్రయాణికులు కాజీపేట జంక్షన్ సమీపంలోని రైల్వే స్టేడియంలో బస్ ప్రాంగణం లో 24 గంటల ప్రయాణ సదుపాయాన్ని కల్పిస్తున్నమనీ ఆయన అన్నారు. బస్సు ప్రాంగణం ద్వారా సునాయాస ప్రయాణం చేసి మేడారం చేరుకోగలరని ఆయన కోరారు. కాజీపేట్ నుండి మేడారం వరకు ఫుల్ టికెట్ రూ 250 హాఫ్ టికెట్ రూ 150 మహిళలకు ఉచితంగా రవాణా ను నిర్ణయించడం జరిగిందని, మంచినీరు, మెడికల్ క్యాంపు , క్యూలైన్, మూత్రశాలలను ఏర్పాటు చేసినట్లుగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే జనరల్ ఇన్స్టిట్యూట్ ట్రెజరర్ జి రాజేశ్వరరావు కమిటీ సభ్యులు ధరావత్ రఘు తెలంగాణ రైల్వే జేఏసీ చైర్మన్ కోండ్ర నర్సింగరావు టి జి ఎస్ ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ భవాని టీజీ బైరి రవీందర్ క్యాంప్ ఇన్చార్జిలు సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఆదేశాలతో సిద్ధమవుతుంది



**ఖమ్మం బ్యూరో, జనవరి 25(తెలంగాణ ముచ్చట్లు):** తెలుగుదేశం పార్టీ ఖమ్మం కార్యాలయంలో జరిగిన పత్రికా విలేఖరుల సమావేశం లో సోమవారం జరగబోయే రాష్ట్ర పార్టీ ఆదేశాలతో మున్సిపల్ ఎన్నికలలో తెలుగుదేశంపార్టీ పోటీ చేస్తుందని, ఆ పార్టీ జిల్లా నాయకులు తెలియచేసారు. ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని అన్ని మున్సిపాలిటీలలో పోటీకి నాయకులు సిద్దంగా వుండాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశం మేరకు పిలుపు రాగానే కలసి వచ్చే పార్టీలతో పోటీ చేయటానికి సిద్ధమని వారన్నారు. ఒకటి రెండు రోజులలో అధికారిక ప్రకటన వస్తుందన్నారు. ఖమ్మం నగరంతో పాటు జిల్లాలోని పలు సమస్యలపై గత బిఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెసు ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టటంలో తెలుగుదేశం పార్టీ అనేక పోరాటాలను చేసి ప్రభుత్వ మెడలను వంచి ప్రజా సమస్యల పరిష్కారం చేయటంలో తెలుగుదేశం పార్టీ ముందుంజలో వున్నదని వారు తెలియచేసారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వున్న చంద్రబాబు నాయుడు గారు మొదలు పెట్టిన సీతారామ ప్రాజెక్టును గత ప్రభుత్వం ఇప్పటి అధికార పక్షం అటకెక్కించిన తీరును ఎండగట్టి చంద్రబాబు తయారు చేయించిన పాత డిపిఆర్ ప్రకారమే తెలుగుదేశం పార్టీ పోరాట ఫలితంగా సీతారామ ప్రాజెక్ట్ కి నిధులు మంజూరు చేసారని వారన్నారు. పాలేరు చెరువులో సీతారామ నీరు పారిస్తే ఉమ్మడి జిల్లా మొత్తం పారుతాయని కావున చంద్రబాబు నాయుడు తయారు చేసిన డిపిఆర్ ద్వారా నే ప్రాజెక్ట్ నిర్మాణం జరగాలన్నారు. కావున వచ్చే మున్సిపల్ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ కే ఓటు అడిగే హక్కు వుందని వారన్నారు. వచ్చే మున్సిపల్ ఎన్నికలలో మెజారిటీ స్థానాలను గెలుచుకుంటామని వారు ధీమా వ్యక్తం చేసారు. ఈ సమావేశం లో కొండబాల కరుణాకర్, లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు మల్లెంపాటి అప్పారావు, టి ఎన్ టి యు సి రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి భాస్కర్ రావు , నాగార్జున శ్రీనివాస్ , గడిపూడి వెంకటేశ్వరావు, బోయిన వెంకన్న, నల్లమోతు సత్యనారాయణ , పాలడుగు క్రిష్ణ ప్రసాద్ , చుండూరు రాజరాజేశ్వరి, బోడేపూడి రవికుమార్, కామినేని శ్రీనివాస్ రావు , చావా రఘు, మల్లెంపాటి లహరిన్, పరిటాల నాగార్జున, మద్దినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు

# ఈస్ట్ గాంధీనగర్ నూతన అధ్యక్షుడిగా గౌరక్క సత్యం సాగర్ ప్రమాణ స్వీకారం



**నాగారం, జనవరి 25 (తెలంగాణ ముచ్చట్లు):** మేడ్చల్ నియోజకవర్గం ఘట్కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ పరిధిలోని ఈస్ట్ గాంధీనగర్ కాలనీలో నూతన అధ్యక్షుడిగా గౌరక్క సత్యం సాగర్ ఆదివారం ఉదయం ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా ఉపాధ్యక్షులుగా కేఎల్ రంగారాయుడు, టి. లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా ఎం. సాయి ప్రసాద్ రెడ్డి, కోశాధికారిగా ఎన్. నవీన్ కుమార్, కార్యదర్శులుగా ఏ. పుల్లారావు, ఎస్.కె. ఇస్మాయిల్ బాధ్యతలు స్వీకరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఈస్ట్ గాంధీనగర్ కాలనీ మాజీ కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్ రెడ్డి హాజరై నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు. కాలనీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాలని ఆయన సూచించారు.ఈ సందర్భంగా గౌరక్క సత్యం సాగర్ మాట్లాడుతూ, కాలనీ వాసుల సహకారంతో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశుధ్యం, తాగునీరు, రహదారుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. కాలనీ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన అధ్యక్షుడికి అభినందనలు తెలిపారు.కాలనీ పెద్దలు కే. అంజిరెడ్డి, కే. బాల మల్లేష్, కే. కొండల్ రెడ్డి, ఎల్. లక్ష్మణ్, ఆర్. భూపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి




**మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టర్, జనవరి 25 (తెలంగాణ ముచ్చట్లు) :** గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో జాతీయ పతాకావిష్కరణకు అవసరమైన వేదికను సిద్ధం చేసి, వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పర్యవేక్షించారు.ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్లను పకడ్బందీగా అమలు చేసేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంది. అలాగే వివిధ శాఖల అధికారులు తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. వేడుకల్లో భాగంగా జాతీయ జెండా ఆవిష్కరణ, గౌరవ వందనం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

# ఆటో యూనియన్ సంఘానికి అండగా నిలుస్తా



- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి,జనవరి25(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి పట్టణంలోని రాజీవ్ ఆటో యూనియన్ సంఘానికి ఎప్పుడూ అండగా ఉంటానని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి భరోసా కల్పించారు. ఆదివారం వనపర్తి పట్టణంలో ఉన్న ఎమ్మెల్యే నివాస కార్యాలయంలో ఆటో యూనియన్ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు, కార్యదర్శులను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు.ఆటో యూనియన్ సంఘ భవన నిర్మాణానికి సంబంధించి స్థలం కేటాయింపు, భవన నిర్మాణం తదితర అంశాల్లో పూర్తిస్థాయిలో సహకరిస్తానని ఎమ్మెల్యే మేఘారెడ్డి తెలిపారు. ఆటో కార్మికుల సంక్షేమానికి తన వంతు కృషి ఎప్పటికీ కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ గౌరవాధ్యక్షులు, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, జిల్లా యూత్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, సంఘం అధ్యక్షులు ఎం.డి. హుస్సేన్, ఉపాధ్యక్షులు తిరుపతి, రసూల్, దుర్గేష్, కోశాధికారి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి పరమేష్‌తో పాటు సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సిఆర్పి యూనియన్ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక




**అశ్వారావుపేట, జనవరి 25 (తెలంగాణ ముచ్చట్లు):** సిఆర్పి యూనియన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం హైదరాబాద్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశం 33 జిల్లాల జిల్లా నాయకుల సమక్షంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షునిగా పాడ్య నాగేశ్వర రావు, జనరల్ సెక్రటరీ రవి నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ రామ్ కుమార్, ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కె రవీంద్రనాథ్, బానోత్ సేవ్య నాయక్, రాజశేఖర్, అశోక్, లింగం,రాజేశం, శివరాం, రమేస్ ను నియమించారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా శివరం, రమేష్, శేఖర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిఆర్పి ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని నూతన నాయకత్వం ఈ సందర్భంగా వెల్లడించింది.

# జాతీయ క్రీడాకారిణి రాజారపు సిరిని సన్మానించిన మాజీ డిప్యూటీ సిఎం రాజయ్య



**క్రీడాకారిణికి ఆర్థిక సహాయం అందజేత**

**వేలేరు,జనవరి25(తెలంగాణ ముచ్చట్లు):** వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామానికి చెందిన రాజారపు సిరి ఇటీవల జాతీయ స్థాయి క్రీడాకారిణిగా గుర్తింపు పొందిన నేపథ్యంలో, తెలంగాణ తొలి ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆమె స్వగృహానికి వెళ్లి అభినందించారు. ఈ సందర్భంగా సిరిని సన్మానించి, ఆర్థిక సహాయం అందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నతమైన స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చాడ విజేందర్ రెడ్డి, కమ్మరిపేట సర్పంచ్ జోడుముంతల కిరణ్, మండల కోఆర్డినేటర్ గోవింద సురేష్, పైస ప్రశాంత్, కళ్యాణ్, అవునూరి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రలోభాలకు లోనవ్వకుండా ఓటు హక్కు వినియోగించుకోవడం మన బాధ్యత






**ఖమ్మం బ్యూరో, జనవరి 25(తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం, మేరా యువ భారత్ సహకారంతో సయ్యద్ యూత్ క్లబ్ వారు జాతీయ ఓటర్ల దినోత్సవం రఘునాథ పాలెం బీసీ డిగ్రీ వెల్ఫేర్ కళాశాల నందు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కె. మురళీధర్ రావు డిప్యూటీ తాసిల్దార్, పాల్గొని విద్యార్థులకు ఓటు యొక్క నమోదు అవశ్యకత గురించి వివరించారు. భారతదేశంలో ప్రతి సంవత్సరం జనవరి 25 వ తేదిన ప్రతిష్టాత్మకంగా ఓటు హక్కు యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కలిగించే విధంగా ఎన్నికల కమిషన్ కొన్ని ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలియజేస్తూ యువత ఉద్యోగ రంగంలోనే కాక రాజకీయ రంగంలో కూడా ప్రవేశించాలని, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా డబ్బులు ఆశించకుండా నిజాయితీగా ఓటు వేయాలని తెలియజేశారు. 19 సంవత్సరాల వయస్సు నిండిన వారు మొదటి ఓటును వినియోగించుకున్న విద్యార్థులకు సన్మానించడం జరిగింది. విద్యార్థులతో మై ఇండియా మై ఓటు అర్థం వచ్చేలా విద్యార్థులు చేసిన ప్రయత్నం ఆకట్టుకుంది. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి, పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ యూత్ క్లబ్ అధ్యక్షుడు సయ్యద్ షారుఖ్ ఇమ్రాన్, ఎస్.కె వహీద్ ఆర్.ఐ మేరా యువ భారత్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కమరతపు భానుచందర్, కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, కళాశాల పిడి ప్రియాంక, యువజన సంఘాల సమితి అధ్యక్షుడు కోడిరెక్క ఉమా శంకర్, సహాయ కార్యదర్శి గోగుల చంద్రశేఖర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లిలో ఘనంగా 'తెలుగుగళం' 2026 కేలండర్ ఆవిష్కరణ





**సత్తుపల్లి, జనవరి 25 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి పట్టణంలో శనివారం తెలుగుగళం జాతీయ తెలుగు దినపత్రిక ముద్రించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా ఆవిష్కరించారు. మొదటిగా సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ కేలండర్‌ను ఆవిష్కరించి, సామాన్యుల గుండెచప్పుడును ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లే వారధిగా తెలుగుగళం పని చేస్తోందని ప్రశంసించారు. అనంతరం పట్టణ పోలీస్ సీఐ శ్రీహరి, పురపాలక సంఘం కమిషనర్ కె. నరసింహా, తహశీల్దార్ సత్యనారాయణ, సబ్ జైలర్ కుటుంబరాజు, మోటార్ వాహనాల తనిఖీ అధికారి జొన్నలగడ్డ నాగ శ్రీనివాసరావు, న్యాయవాది బోయినపల్లి రవి, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు కేలండర్‌ను ఆవిష్కరించి తెలుగుగళం సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పత్రిక ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.






# సింగరేణి సమీక్షకు హాజరైన ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

**ఖమ్మం బ్యూరో, జనవరి 25(తెలంగాణ ముచ్చట్లు):** రెండు రోజుల జిల్లా పర్యటనకు వచ్చిన కేంద్ర బొగ్గు, గనుల శాఖల మంత్రి గంగాపురం కిషన్ రెడ్డితో కలిసి ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి సింగరేణి సమీక్ష సమావేశానికి హాజరయ్యారు. ఆదివారం కొత్తగూడెం క్లబ్ లో జరిగిన సింగరేణి అధికారులు, కార్మిక నాయకులతో జరిగిన సమావేశానికి కేంద్ర మంత్రి హాజరుకాగా.. ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి వెళ్లి మర్యాదపూర్వ కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సింగరేణి ఇన్చార్జ్ సీఎండీ కృష్ణ భాస్కర్, తదితర ఉన్నతాధికారులతో కలిసి సలహాలు, సూచనలు స్వీకరించారు.

# జనం మెచ్చిన వారికే టికెట్లు...!

- పైరవీలకు తావులేదు.. వారసత్వానికి చోటులేదు
- ఏదులాపురం మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దే బాధ్యత నాది
- శివరాత్రి లోపే ఎన్నికల ప్రక్రియ పూర్తి!
- మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మంత్రి పొంగులేటి



**ఖమ్మం బ్యూరో, జనవరి 25(తెలంగాణ ముచ్చట్లు):** మున్సిపల్ ఎన్నికల నగారా మోగనుంది.. మనమంతా సిద్ధం కావాలి. అభ్యర్థుల ఎంపికలో ప్రజాభిప్రాయమే తుది నిర్ణయం. పైరవీలకు ఇక్కడ తావులేదు. జనం కోరుకునే వ్యక్తికే బిఫామ్ అందుతుందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో పాలేరు నియోజకవర్గ పరిధిలోని ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని వార్డుల నుంచి తరలివచ్చిన పార్టీ ఇంచార్జీలు, ముఖ్య నాయకులకు ఆయన దిశానిర్దేశం చేశారు. సర్వేల ఆధారంగానే ఎంపిక..టికెట్ల కేటాయింపుపై మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. "వారసత్వ రాజకీయాలకు నా వద్ద చోటు లేదు. నా రక్తసంబంధీకులకు ఎవరికీ టికెట్లు ఇవ్వను. ఇప్పటికే రెండు మూడు బృందాలతో క్షేత్రస్థాయిలో సర్వేలు చేయిస్తున్నాం. ప్రజలు ఎవరినైతే ఆదరిస్తారో, ఎవరికైతే గెలిచే సత్తా ఉందో వారికే అవకాశం దక్కుతుంది. ఓటర్ల మనసు గెలుచుకున్న వారే అభ్యర్థులుగా బరిలోకి దిగుతారు" అని పేర్కొన్నారు.

రెచ్చగొడితే మోసపోవద్దు.. పార్టీలో టికెట్ రాని వారు నిరాశ చెందవద్దని, అసంతృప్తితో ఇతర పార్టీల వైపు చూడవద్దని మంత్రి సూచించారు. "అధికారంలో ఉన్నాం కాబట్టి అందరికీ ఏదో ఒక రూపంలో సముచిత స్థానం కల్పిస్తాం. కొందరిని కోఆప్షన్ సభ్యులుగా, మరికొందరికి నామినేటెడ్ పదవుల ద్వారా గౌరవిస్తాం. పార్టీని కాదని స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేయాలని ఎవరైనా రెచ్చగొడితే మోసపోవద్దు. అటువంటి వారి రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుంది" అని హెచ్చరించారు.

మోడల్ మున్సిపాలిటీగా చేయడమే లక్ష్యం ఏదులాపురం మున్సిపాలిటీని మోడల్ మున్సిపాలిటీగా మార్చడమే తన లక్ష్యమని మంత్రి వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 15న శివరాత్రి లోపు ఎన్నికలు, కౌంటింగ్, ప్రమాణ స్వీకార కార్యక్రమం అంతా పూర్తయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

కార్యకర్తలే నా బలం.. "మీరు నా కళ్ళు, చెవుల వంటి వారు. మీ కష్టమే నాకు గౌరవం. నేను ఎప్పుడూ కార్యకర్తలను విస్మరించను. ప్రజలతో నిరంతరం మమేకమై ఉండే వారికే నా మద్దతు ఉంటుంది" అని మంత్రి పొంగులేటి ఉద్ఘాటించారు. అనంతరం ఒక్కో వార్డు నాయకులతో ఆయన ముఖాముఖి చర్చించి, స్థానిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఏకశిల జూనియర్ కళాశాలలో స్పార్క్లింగ్ సెలబ్రేషన్స్





- విద్యార్థులకు లక్ష్యసాధన, క్రమశిక్షణ అవసరమని నేతల సూచన

**హనుమకొండ, జనవరి 25(తెలంగాణ ముచ్చట్లు):** ఏకశిల గ్రూప్ చైర్మన్ డా. గౌరు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో ఏకశిల జూనియర్ కళాశాలలో స్పార్క్లింగ్ సెలబ్రేషన్స్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా వర్ధన్నపేట శాసనసభ్యులు కె.ఆర్. నాగరాజు హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడిన శాసనసభ్యులు, ఇంటర్మీడియట్ విద్య విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే కీలక దశగా పేర్కొన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, క్రమశిక్షణతో చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకుని, దాన్ని సాధించేందుకు నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

కళాశాల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను గౌరవిస్తూ, జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్ణయించుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలంటే విద్యతో పాటు విలువలు అవసరమని పేర్కొన్నారు.ముఖ్య అతిథి శివప్రసాద్ మాట్లాడుతూ, సమయానికి ఉన్న ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ప్రతి నిమిషాన్ని విలువైనదిగా భావించి సద్వినియోగం చేసుకుంటేనే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జితేందర్ రెడ్డి, ప్రిన్సిపాళ్లు సుధాకర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రాజి రెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో ‘క్లీన్ స్వీప్’ లక్ష్యంగా పనిచేయాలి

- పార్టీ గెలుపే పరమావధిగా అందరూ సమన్వయంతో సాగాలి
- సర్వే ఆధారంగానే అభ్యర్థుల ఎంపిక : మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- ఇల్లందు నేతలతో మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం



**ఖమ్మం బ్యూరో, జనవరి 25 (తెలంగాణ ముచ్చట్లు):**రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఇల్లందు మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యతో కలిసి మున్సిపల్ ముఖ్య నేతలు, ఆశావహులతో మంత్రి సమావేశం నిర్వహించారు.

త్వరలోనే ఎన్నికల నగారా

ఎన్నికల ప్రక్రియ అతి త్వరలోనే ప్రారంభం కానుందని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. "వచ్చే నెల మధ్య నాటికి ఎన్నికల ప్రక్రియ అంతా పూర్తయ్యే అవకాశం ఉందన్నారు. సమయం తక్కువగా ఉన్నందున పార్టీ శ్రేణులు ఇప్పుడే క్షేత్రస్థాయిలోకి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు.

పారదర్శకంగా అభ్యర్థుల ఎంపిక

టికెట్ల కేటాయింపులో పూర్తి పారదర్శకత పాటిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి వార్డులో ప్రజల ఆమోదం, అభ్యర్థి యోగ్యత ఆధారంగా శాస్త్రీయంగా సర్వే నిర్వహించి, ఆ నివేదికల ప్రకారమే బిఫామ్ ఇస్తామని వెల్లడించారు. పార్టీ పట్ల విధేయత, ప్రజలకు సేవ చేయాలనే తపన ఉన్నవారికే ప్రాధాన్యత ఉంటుందని, ఎలాంటి ప్రలోభాలకు తావులేకుండా అర్హులకే సీట్లు దక్కుతాయని భరోసా ఇచ్చారు.

క్రమశిక్షణే ముఖ్యం.. అందరికీ సముచిత స్థానం

పార్టీ నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని మంత్రి కోరారు. "ఒకే వార్డులో ఎక్కువ మంది అభ్యర్థులు ఉండటం సహజం. కానీ బిఫామ్ ఒకరికే దక్కుతుంది. టికెట్ రాని మిత్రులు ఆందోళన చెందవద్దు. పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరినీ గుర్తించి, భవిష్యత్తులో కోఆప్షన్ సభ్యులుగా లేదా ప్రభుత్వంలోని ఇతర పదవుల ద్వారా వారి రాజకీయ గౌరవానికి భంగం కలగకుండా చూసే బాధ్యత నాదే" అని హామీ ఇచ్చారు. పార్టీ లైన్ దాటకుండా, ప్రతి ఒక్కరూ అధికారిక అభ్యర్థి గెలుపు కోసం సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

అభివృద్ధికి నిధుల వెల్లువ

"ఇల్లందు అభివృద్ధికి ఇప్పటికే కోట్ల రూపాయల నిధులను కేటాయించాం. మున్సిపాలిటీలోని 24 వార్డుల్లో మన అభ్యర్థులను గెలిపిస్తే, భవిష్యత్తులో మరింత భారీగా నిధులు తీసుకువచ్చి ఇల్లందు రూపురేఖలు మారుస్తా" అని మంత్రి వాగ్దానం చేశారు. తనను నమ్ముకున్న కార్యకర్తలను కుటుంబ సభ్యుల్లా కాపాడుకుంటానని, అందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని కోరారు.

# అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవం – ప్రపంచ వాణిజ్యానికి నిశ్శబ్ద రక్షకులు

ప్రపంచం గ్లోబలైజేషన్ దిశగా వేగంగా అడుగులు వేస్తున్న ఈ కాలంలో దేశాల మధ్య వాణిజ్యం, రవాణా, సాంకేతిక మార్పిడులు విస్తృతంగా జరుగుతున్నాయి. ఈ మొత్తం వ్యవస్థ సజావుగా నడవాలంటే సరిహద్దుల వద్ద అప్రమత్తంగా పనిచేసే కస్టమ్స్ విభాగం కీలకంగా మారుతుంది. ప్రతి సంవత్సరం జనవరి 26న జరుపుకునే అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవం, ప్రపంచవ్యాప్తంగా కస్టమ్స్ అధికారుల సేవలను గుర్తించేందుకు, వారి బాధ్యతల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయడానికి ఉద్దేశించిన ప్రత్యేక రోజు.

కస్టమ్స్ వ్యవస్థను చాలామంది కేవలం దిగుమతులు-ఎగుమతులపై సుంకాలు వసూలు చేసే శాఖగా మాత్రమే చూస్తారు. కానీ వాస్తవంగా కస్టమ్స్ విభాగం దేశ ఆర్థిక వ్యవస్థకు ఒక రక్షణ కవచంలాంటిది. అక్రమ వాణిజ్యం, స్మగ్లింగ్, మత్తుపదార్థాల అక్రమ రవాణా, నకిలీ వస్తువుల చలామణి వంటి అనేక ప్రమాదాలను అడ్డుకునే తొలి రక్షణ గోడ కస్టమ్స్ వ్యవస్థే. విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, భూసరిహద్దుల వద్ద నిత్యం అప్రమత్తంగా పనిచేస్తూ, దేశంలోకి హానికరమైన వస్తువులు ప్రవేశించకుండా అడ్డుకోవడం వారి ప్రధాన బాధ్యత.

ప్రపంచ వాణిజ్యం విస్తరిస్తున్న కొద్దీ కస్టమ్స్ అధికారులపై పని భారం కూడా గణనీయంగా పెరుగుతోంది. ఒకవైపు వ్యాపారులకు వేగవంతమైన క్లియరెన్స్ అందించాల్సిన అవసరం, మరోవైపు చట్ట ఉల్లంఘనలను కట్టడి చేయాల్సిన బాధ్యత - ఈ రెండింటి మధ్య సమతుల్యతను పాటించడం పెద్ద సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ డిజిటలైజేషన్, ఆటోమేషన్, స్కానింగ్ వ్యవస్థలు, డేటా విశ్లేషణ వంటి పద్ధతులను కస్టమ్స్ విభాగం విస్తృతంగా అమలు చేస్తోంది. దీని వల్ల పారదర్శకత పెరగడంతో పాటు అవినీతి తగ్గించడంలో కూడా కొంతమేర విజయం సాధిస్తోంది.

అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా కస్టమ్స్ విభాగాల పనితీరుపై చర్చలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉత్తమ సేవలు అందించిన అధికారులను సత్కరించడం ద్వారా వారి ఉత్సాహాన్ని పెంచే ప్రయత్నం జరుగుతుంది. ఇదే సమయంలో సాధారణ ప్రజలకు కూడా కస్టమ్స్ నిబంధనలపై అవగాహన కల్పించడమే ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశం. విదేశాల నుంచి వస్తువులు తీసుకొచ్చేటప్పుడు పాటించాల్సిన నియమాలు, చట్టాలను గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అనే విషయాన్ని ఈ రోజు గుర్తు చేస్తుంది.

దేశ భద్రత, ఆర్థిక స్థిరత్వం, అంతర్జాతీయ విశ్వసనీయత – ఈ మూడు అంశాలు బలంగా నిలవాలంటే కస్టమ్స్ వ్యవస్థ సమర్థంగా పనిచేయాల్సిందే. నిశ్శబ్దంగా, పెద్దగా వెలుగులోకి రాకుండా పనిచేస్తూ దేశ ప్రయోజనాలను కాపాడుతున్న కస్టమ్స్ అధికారుల అంకితభావాన్ని గుర్తించడమే అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవం అసలైన ఆత్మ. ప్రపంచాన్ని ఒకే మార్కెట్‌గా మార్చే ప్రయాణంలో, సరిహద్దుల వద్ద నిలబడి వ్యవస్థను కాపాడుతున్న ఈ రక్షకుల సేవలు అనన్యసాధారణమైనవని ఈ రోజు మనందరికీ గుర్తు చేస్తుంది. కస్టమ్స్ అంటే కేవలం దిగుమతులు-ఎగుమతులపై పన్నులు వసూలు చేసే శాఖగా మాత్రమే చాలా మందికి తెలిసి ఉంటుంది. కానీ వాస్తవానికి ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటిది. అక్రమ రవాణా, స్మగ్లింగ్, మత్తుపదార్థాల అక్రమ వ్యాపారం, నకిలీ సరుకుల చలామణి వంటి అనేక సమస్యలను అడ్డుకునే తొలి గోడ కస్టమ్స్ వ్యవస్థే. విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, భూసరిహద్దుల వద్ద నిత్యం అప్రమత్తంగా పనిచేస్తూ, దేశంలోకి హానికరమైన వస్తువులు ప్రవేశించకుండా అడ్డుకుంటుంది.

అంతర్జాతీయ వాణిజ్యం పెరుగుతున్న కొద్దీ కస్టమ్స్ అధికారులపై పని భారం కూడా పెరిగింది. ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ, స్కానర్లు, డిజిటల్ డేటా విశ్లేషణ, రిస్క్ మేనేజ్‌మెంట్ వంటి విధానాలతో వారు తమ విధులను మరింత సమర్థంగా నిర్వహిస్తున్నారు. వేగవంతమైన క్లియరెన్స్ ద్వారా వ్యాపారులకు సౌలభ్యం కల్పిస్తూ, మరోవైపు చట్ట ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవడం వారి ప్రధాన బాధ్యత. ఈ సమతుల్యతే కస్టమ్స్ వ్యవస్థ విజయానికి ఆధారం.

అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా కస్టమ్స్ విభాగాల పనితీరుపై చర్చలు, అవగాహన కార్యక్రమాలు, ఉత్తమ సేవలు అందించిన అధికారులకు పురస్కారాలు నిర్వహిస్తారు. ఇది కేవలం అధికారుల సేవలను ప్రశంసించడమే కాకుండా, ప్రజల్లో కస్టమ్స్ నిబంధనలపై అవగాహన పెంచే అవకాశం కూడా. చట్టబద్ధమైన వాణిజ్యానికి సహకరించడం, నిబంధనలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అనే సందేశాన్ని ఈ రోజు బలంగా గుర్తు చేస్తుంది.

మొత్తానికి, అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవం ప్రపంచ వాణిజ్య వ్యవస్థను సజావుగా నడిపించే నిశ్శబ్ద రక్షకులను స్మరించుకునే రోజు. దేశ భద్రత, ఆర్థిక స్థిరత్వం, అంతర్జాతీయ నమ్మకం – ఈ మూడింటికీ కస్టమ్స్ వ్యవస్థ అనివార్యమైనది. వారి అంకితభావం వల్లే ప్రపంచం ఒక సరిహద్దులేని మార్కెట్‌గా ముందుకు సాగగలుగుతోంది.

# పలు శుభకార్యాల్లో పాల్గొన్న టిఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్



**ఖమ్మం బ్యూరో, జనవరి 25(తెలంగాణ ముచ్చట్లు):** ఖమ్మం జిల్లా చింతకాని మండలం కోమట్ల గూడెం గ్రామ టిఆర్ఎస్ నాయకులు వేముల వెంకటేశ్వర్లు రమాదేవి కుమారుడు కుమార్తెల యొక్క నూతన వస్త్రాలంకరణ వేడుకలో మధిర డివిజన్ టిఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్ పాల్గొని పిల్లల్ని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కోమట్ల గూడెం మాజీ సర్పంచ్ వేముల నరసయ్య, నాగిలి గొండ మాజీ సర్పంచ్ చాట్ల సురేష్ మాజీ ఎంపిటిసి చాట్ల భగవాన్ టిఆర్ఎస్ నాయకులు అరికోట్ల ప్రసాద్ సుమన్ మద్దినేని వెంకటేశ్వర్లు, చాట్ల కృష్ణ, షేక్ షరీఫ్, సింగాల అచ్చయ్య బోరిగార్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల బాలికల పాఠశాల ప్రవేశాల పోస్టర్ ఆవిష్కరణ




**నాచారం, జనవరి 25 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గ నాచారం డివిజన్ పరిధిలోని తెలంగాణ మైనారిటీ గురుకుల ఉప్పల్ బాలికల పాఠశాలలో 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం వరకు, అలాగే 6, 7, 8 తరగతుల బ్యాక్‌లాగ్ ఖాళీలకు సంబంధించిన ప్రవేశాల నమోదు పోస్టర్‌ను నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ ఘనంగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో మైనారిటీ సంఘాల నాయకులు, తల్లిదండ్రులు, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం మైనారిటీ విద్యార్థినుల విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. మైనారిటీ గురుకుల పాఠశాలల ద్వారా నాణ్యమైన విద్యతో పాటు వసతి, భోజనం, పుస్తకాలు, యూనిఫాం వంటి సౌకర్యాలను పూర్తిగా ఉచితంగా అందిస్తున్నట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని మైనారిటీ తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకొని తమ పిల్లల భవిష్యత్తును మరింత ఉజ్వలంగా తీర్చిదిద్దాలని కోరారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, విద్యార్థినుల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని వసతులతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల ద్వారా నాణ్యమైన బోధన అందిస్తున్నామని పేర్కొన్నారు. విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యక్తిత్వ వికాసంలోనూ విద్యార్థినులు ముందంజలో ఉండేలా కృషి చేస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమం విద్యార్థినులు, తల్లిదండ్రుల్లో మంచి స్పందనను రేపింది.

# దేశమా నీకు ఇదే వందనం

దేశమా నీకు ఇదే వందనం
గణతంత్ర మా నీకు ఘన స్వాగతం
ఈ దేశం నాది ఈ రాజ్యం నాది
అని ప్రతి పౌరుడుకి ఉండాలి
ప్రతి పౌరుడు సైనికుల పోరాడాలి!!

మూడు రంగుల జెండా మురిసిపోవాలి
భారతీయులంతా కలసి రావాలి
గణతంత్ర దినోత్సవ సంబరాలలో
మన దేశ ఖ్యాతి దిగంతాలు దాటాలే!!

నాటి నేతల స్ఫూర్తిని పునికి పుచ్చుకోవాలి
అభివృద్ధి బాటలో అడుగులు వేయాలి
భారతావని గుండెల్లో వెలుగులు నింపాలి
విజ్ఞాన గనిగా నింగినంటాలి
నా భారతదేశం!!



-: రచన :-
**దేవులపల్లి రమేశ్**
కలం: శ్రీ వర్ష
నంగునూర్, సిద్దిపేట
9963701294

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# నిమ్మకాయను ఆహారంలో చేర్చుకుంటే..

నిమ్మకాయలు పోషకాల నిలయం. విటమిన్ సి, ఫైబర్‌తో సహా ఎన్నో పోషకాలు ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంచడం, బరువు తగ్గడం, రక్తపోటు నియంత్రణ, క్యాన్సర్ నివారణ వంటి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. మీ రోజువారీ ఆహారంలో నిమ్మకాయలను చేర్చుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చు. సిట్రస్ పండ్లలో రారాజుగా పిలిచే నిమ్మకాయలు కేవలం రుచిని పెంచడానికి మాత్రమే కాదు.. విటమిన్ సి, ఫైబర్‌తో సహా అనేక కీలక పోషకాలకు నిలయం. మీ రోజూవారీ ఆహారంలో నిమ్మకాయను చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య లక్ష్యాలను చేరుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.
నిమ్మకాయలలో విటమిన్ సి, ఫోలేట్ పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడానికి ప్రసిద్ధి చెందాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని నియంత్రించడం, వాపు తగ్గించడం ద్వారా రోగనిరోధక వ్యవస్థకు మద్దతు ఇస్తాయి. పరిశోధనల ప్రకారం.. సిట్రస్ పండ్లలో ఉండే ఫ్లేవనాయిడ్లు మహిళల్లో ఇస్కీమిక్ స్ట్రోక్ రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తాయి. ఫ్లేవనాయిడ్లు ఎక్కువగా తీసుకునే వ్యక్తులకు గుండె జబ్బులు, స్ట్రోక్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయి. నిమ్మకాయల్లోని ఫ్లేవనాయిడ్లు రక్తపోటును అణచివేయడానికి సహాయపడతాయి. ఇవి జీర్ణవ్యవస్థలోని సూక్ష్మజీవులతో కలిసి గుండెను రక్షిస్తాయి.
నిమ్మకాయ తీసుకోవడం సిస్టోలిక్ రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది. సిట్రస్ పండ్లను అధికంగా తీసుకునే వ్యక్తులకు, తక్కువగా తీసుకునే వారి కంటే ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే ప్రమాదం 9శాతం తక్కువగా ఉందని ఒక విశ్లేషణలో తేలింది. ముఖ్యంగా నిమ్మ తొక్కలు క్యాన్సర్ నిరోధక లక్షణాలను కలిగి ఉండవచ్చని పరిశోధనలు సూచిస్తున్నాయి.
నిమ్మకాయల్లోని విటమిన్ సి, ఆహారంలోని ఐరన్ శోషణను పెంచడానికి సహాయపడుతుంది. ఐరన్ అధికంగా ఉండే ఆహారాన్ని, విటమిన్ సి ఎక్కువగా ఉండే నిమ్మకాయలతో కలిపి తీసుకోవడం వల్ల రక్తహీనత వంటి సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు. సిట్రస్ రసం వృద్ధాప్య సంకేతాలను నివారించడానికి లేదా తగ్గించడానికి సహాయపడుతుంది. ఇది చర్మం మందాన్ని తగ్గించి, ముడతలు ఏర్పడటాన్ని తగ్గిస్తుంది. కొల్లాజెన్ కంటెంట్‌ను పెంచుతుంది.
ప్రతిరోజూ పండ్లు, కూరగాయలు, ముఖ్యంగా సిట్రస్ పండ్లను తీసుకోవడం వల్ల ఆస్తమా, శ్వాసలో గురక వచ్చే అవకాశాలు తగ్గుతాయని అధ్యయనాలు కనుగొన్నాయి. నిమ్మరసం త్వరగా కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. ఇది గ్యాస్ట్రిక్ కంటెంట్ పరిమాణాన్ని పెంచుతుంది. తద్వారా ఆకలిని తగ్గిస్తుంది. కాబట్టి బరువు తగ్గాలనుకునే వారికి నిమ్మకాయ మంచి ఆహార పదార్థం.

# ఎండు మిర్చి డైట్‌లో ఉందంటే.. ఆ సమస్యల కథ క్లైమాక్స్‌కి చేరినట్టే

మనం వంటల్లో ఉపయోగించే వాటిల్లో ఎండు మిర్చి కూడా ఒకటి. తాళింపు వంటి వాటిల్లో ఎండు మిర్చి ఖచ్చితంగా వేస్తారు. ఎండు మిర్చితో తాళింపు సువాసనే మారిపోతుంది. రుచి కూడా పెరుగుతుంది. ఎండు మిర్చితో ఎక్కువగా రోటి పచ్చళ్లు తయారు చేస్తూ ఉంటారు. పచ్చి మిర్చి కంటే ఎండు మిర్చితోనే రుచి అనేది బాగా వస్తుంది. భారత దేశంలో అందులోనూ తెలుగు రాష్ట్రాల్లో కారం ఎక్కువగా తింటారు. కారాన్ని మితంగా తినడం వల్ల చాలా లాభాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మనం వంటల్లో ఉపయోగించే వాటిల్లో ఎండు మిర్చి కూడా ఒకటి. తాళింపు వంటి వాటిల్లో ఎండు మిర్చి ఖచ్చితంగా వేస్తారు. ఎండు మిర్చితో తాళింపు సువాసనే మారిపోతుంది. రుచి కూడా పెరుగుతుంది. ఎండు మిర్చితో ఎక్కువగా రోటి పచ్చళ్లు తయారు చేస్తూ ఉంటారు. పచ్చి మిర్చి కంటే ఎండు మిర్చితోనే రుచి అనేది బాగా వస్తుంది. భారత దేశంలో అందులోనూ తెలుగు రాష్ట్రాల్లో కారం ఎక్కువగా తింటారు. కారాన్ని మితంగా తినడం వల్ల చాలా లాభాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఎండు మిర్చి తినడం వల్ల కూడా ఆరోగ్యానికి చాలా మంచిది. ఈ మిర్చి తినడం వల్ల చాలా రకాల వ్యాధుల్ని దూరం అవుతాయి.ఎండు మిర్చి తినడం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.



దీంతో రోగాలతో పోరాడే శక్తి లభిస్తుంది. బరువు తగ్గాలి అనుకునేవారు కూడా ఎండు మిర్చి తినవచ్చు. ఎండు మిర్చి తింటే ఎంత గుట్టలాంటి పొట్టైనా కరుగుతుంది. కారం తినడం వల్ల గుండె సమస్యలు అనేవి తగ్గుతాయి. ఎందుకంటే దీని వల్ల ధమనుల్లో ఉండే అధిక కొవ్వు అనేది కరుగుతుంది. బీపీ, షుగర్ వంటి వ్యాధులు కూడా కంట్రోల్‌లో ఉంటాయి. అలాగే ట్యూమర్, వాపుల నుంచి శరీరాన్ని రక్షిస్తుంది. రెడ్ చిల్లీ తింటే ఆయుష్షు అనేది పెరుగుతుంది. అకాల మరణం సంభవించే అవకాశం తక్కువ. కండరాల నొప్పులు కూడా తగ్గుతాయి. అంతే కాకుండా జలుబు, దగ్గు వంటి సమస్యలు కూడా రావు. జీర్ణ సంబంధిత సమస్యలు కూడా తగ్గుతాయి.



# బెల్లం నీళ్లు తాగితే శరీరంలో జరిగే అద్భుతాలు

బెల్లం రుచికరమైన స్వీటెనర్ మాత్రమే కాదు.. ఇది పోషకాల నిధి. చెరకు రసం నుండి తయారయ్యే బెల్లంలో అనేక శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు నిజాలు ఉంటాయి. దీని సహజమైన తీపి చక్కెర కంటే చాలా ఆరోగ్యకరమైనది. అందుకే చాలా మంది భోజనం తర్వాత ఒక చిన్న బెల్లం ముక్క తినడానికి ఇష్టపడతారు. శరీరం డీటాక్స్: బెల్లం నీరు ఒక సహజమైన డీటాక్ డ్రింక్. దీన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీరంలో పేరుకుపోయిన విషాన్ని సమర్థవంతంగా బయటకు పంపి, కాలేయం పనితీరును మెరుగుపరుస్తుంది. అంతేకాకుండా ఇది రక్తాన్ని కూడా శుద్ధి చేస్తుంది. బెల్లం నీటిని కేవలం 7 రోజులు తాగడం ద్వారా రక్త శుద్ధిలో ఫలితాలు కనిపించడం మొదలవుతాయి. చర్మ సమస్యలు: బెల్లం కేవలం అంతర్గత ఆరోగ్యానికి మాత్రమే కాక చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా సహాయపడుతుంది. దీన్ని క్రమం తప్పకుండా గోరువెచ్చని నీటితో కలిపి తాగడం వల్ల మొటిమలు, మచ్చలు వంటి చర్మ సమస్యలు తగ్గుముఖం పడతాయి. ఆయుర్వేదంలో కూడా వేడి నీరు, బెల్లం మిశ్రమం చర్మానికి ప్రయోజనకరంగా ఉంటుంది. లివర్ హెల్త్: బెల్లంలో లభించే ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి దోహదపడతాయి. బెల్లం నీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కాలేయం శుభ్రపడటంతో పాటు కొవ్వు కాలేయ సమస్యలు వంటి వాటిని నయం చేయడంలో కూడా సహాయపడుతుంది.
పీరియడ్స్ నొప్పి: మహిళలకు బెల్లం నీరు ఒక అద్భుతమైన ఔషధంలా పనిచేస్తుంది. బెల్లం కషాయంలో ఉండే మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలు.. పీరియడ్స్ సమయంలో సంభవించే కడుపు నొప్పి, బలహీనత, మానసిక స్థితిలో మార్పులను తగ్గించడంలో సహాయపడతాయి. ఈ సమయంలో మహిళలు బెల్లం నీటిని లేదా బెల్లం కషాయాన్ని తాగడం చాలా మంచిది. జీర్ణవ్యవస్థ: ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీటితో బెల్లం కలిపి తాగడం జీర్ణక్రియకు అత్యంత ప్రయోజనకరం. ఇది జీర్ణక్రియ సరిగ్గా జరిగేలా చూస్తుంది. కడుపులో గ్యాస్, ఆమ్లత్వం, మలబద్ధకం నుండి ఉపశమనం కలిగిస్తుంది. బెల్లంలో ఉండే ఫైబర్ పేగులను శుభ్రపరుస్తుంది. ప్రేగు కదలికలను సులభతరం చేస్తుంది.

# పొరపాటున వీటిని మళ్లీ వేడి చేసి తినకండి..!



చాలా మంది రాత్రి మిగిలి పోయిన కూరగాయలను ఫ్రిజ్‌లో పెట్టుకొని మార్నింగ్ వేడి చేసుకొని తింటారు. కానీ అలా చేయడం మంచిది కాదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కొన్ని కూరగాయలలో నైట్రేట్లు పుష్కలంగా ఉంటాయి. వాటిని మళ్ళీ వేడి చేసినప్పుడు అవి నైట్రోసమైన్‌లుగా మారుతాయి. ఇది మన శరీరానికి హాని కలిగిస్తుందని నిపుణులు చెబుతున్నారు. పాలకూర: మళ్లీ వేడి చేసుకొని తినకూడని కూగయాల్లో పాలకూర మొదటి స్థానంలో ఉంది. ఎందుంకంటే దీనిలో నైట్రేట్లు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి దీన్ని మళ్లీ వేడి చేసినప్పుడు, ఇవి నైట్రేట్‌లుగా మారుతాయి. దీన్ని అలానే తినడం వల్ల ఇది రక్త ఆక్సిజన్ స్థాయిలను తగ్గిస్తుంది. పిల్లలలో బ్లూస్కిన్ సిండ్రోమ్‌కు కారణమవుతుంది. ఇది పెద్దలలో తలతిరగడం, వాంతులు, తలనొప్పి,కడుపు నొప్పిని కూడా దారి తీస్తుంది. రెండోసారి వేడి చేసినప్పుడు పాలకూరలో ఉన్న ఇనుము ఆక్సీకరణం చెంది ఫ్రీ రాడికల్స్‌ను ఉత్పత్తి చేస్తుంది. దీని వల్ల మనం అనేక రకాల ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుంది.బంగాళాదుంపలు: బంగాళాదుంపలను ఎప్పుడూ రెండోసారి వేడి చేయకూడదు. అలా చేయడం వల్ల అందులో ఉండే బోటులిజం బ్యాక్టీరియా ప్రమాదం పెరుగుతుంది. అలాగే, బంగాళాదుంపలలోని స్టార్చ్ మళ్లీ వేడి చేసినప్పుడు విచ్ఛిన్నమై, హానికరమైన సమ్మేళనాలను ఏర్పరుస్తాయి. ఇవి మన శరీరానికి హాని చేస్తాయి. కాబట్టి ఉడికించిన లేదా బంగాళాదుంప ఆధారిత కూరగాయలను మళ్లీ వేడి చేయడం చాలా సురక్షితం కాదు.
పుట్టగొడుగు: పుట్టగొడుగులలో ప్రోటీన్ అధికంగా ఉంటుంది. దాన్ని మళ్లీ వేడి చేసినప్పుడు దాని ప్రభావం ప్రతికూలంగా పనిచేస్తుంది. దీనివల్ల కడుపు నొప్పి, గ్యాస్, వాంతులు, విరేచనాలు వస్తాయి. కాబట్టి, పుట్టగొడుగుల ఆహారాలను వెంటనే తీసుకోవాలి. రెండోసారి వేడి చేసి తీసుకోకూడదు. బియ్యం: బియ్యాన్ని కూడా రెండోసారి వేడి చేయకూడదు. వండిన బియ్యంలో బాసిల్లస్ సెరియస్ బ్యాక్టీరియా ఉంటుంది. దీన్నిరెండోసారి వేడి చేయడం వల్ల వాటి పరిమాణం పెరుగుతుంది. వాటిని తింటే తీవ్రమైన వాంతులు, విరేచనాలు వస్తాయి. అందువల్ల, బియ్యాన్ని సరిగ్గా నిల్వ చేసి త్వరగా తినడం చాలా ముఖ్యం.4 / మరికొన్ని కూరగాయాలు: పైన పేర్కొన్న కూరగాయలే కాకుండా క్యారెట్లు, టర్నిప్‌లు, దుంపలు వంటి భూగర్భంలో పెరిగే చాలా కూరగాయలలో నైట్రేట్ ఎక్కువగా ఉంటుంది. కాబట్టి వీటిని రెండోసారి వేడి చేసి తినకండి. ఇలా చేయడం వల్ల క్యాన్సర్ కారక లక్షణాలు కూడా మీలో కనిపిస్తాయి. కాబట్టి వాటికి దూరంగా ఉండండి.

# డయాబెటిస్ సహా ఆ సమస్యలను తరిమికొట్టే ఛూమంత్రం



వాస్తవానికి వంటకాల రుచిని పెంచడానికి మసాలా దినుసు యాలకులను ఉపయోగిస్తారు. ఇందులో ఆరోగ్యానికి మేలు చేసే అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. దీని వినియోగం మలబద్ధకం, రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధుల నుండి ఉపశమనాన్ని అందిస్తుంది. అమీఅ.అశ్రీఎ. అఅష్ట్ర.స్త్రశీజలో ప్రచురించబడిన పరిశోధనలో యాలకులను వివరంగా అధ్యయనం చేశారు. డయాబెటిస్ అనేది దీర్ఘకాలిక వ్యాధి.. మధుమేహం చాలా కాలం పాటు రక్తంలో అధిక చక్కెర స్థాయిల వల్ల కలిగే వ్యాధి. క్లోమం ద్వారా ఇన్సులిన్ హార్మోన్ విడుదల ఆగిపోతుంది లేదా తక్కువగా విడుదల అవుతుంది. కార్బోహైడ్రేట్ ఆహారాల వినియోగం నుండి పొందిన గ్లూకోజ్ శక్తిగా మార్చబడదు. ఇది రక్తంలోనే ఉంటుంది. దీని కారణంగా, ఒక వ్యక్తి తన రోజువారీ పనికి చాలా ముఖ్యమైన శక్తిని పొందలేకపోతుంటాడు.. డయాబెటిస్ కు జీవితకాల నిర్వహణ అవసరం.. ప్యాంక్రియాస్ తగినంత ఇన్సులిన్ ఉత్పత్తి చేయనప్పుడు లేదా శరీరం ఇన్సులిన్‌ను సరిగ్గా ఉపయోగించుకోనప్పుడు ఇది వస్తుంది. డయాబెటిక్ రోగులకు రక్తంలో చక్కెరను నియంత్రించడం అంత సులభం కాదు. దీని కోసం, డయాబెటిక్ రోగులు వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. మీరు డయాబెటిక్ అయితే.. రక్తంలో చక్కెరను నియంత్రించాలనుకుంటే, మీరు ఏలకులు తినవచ్చు. అనేక అధ్యయనాల ఫలితాలు యాలకులకు రక్తంలో చక్కెరను నియంత్రించే సామర్థ్యం ఉందని చూపించాయి. వాస్తవానికి వంటకాల రుచిని పెంచడానికి మసాలా దినుసు యాలకులను ఉపయోగిస్తారు. ఇందులో ఆరోగ్యానికి మేలు చేసే అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. దీని వినియోగం మలబద్ధకం, రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధుల నుండి ఉపశమనాన్ని అందిస్తుంది. ఈ పరిశోధన డయాబెటిక్ రోగులకు యాలకులు ప్రయోజనకరంగా ఉంటుందని నిరూపించింది.ఈ అధ్యయనంలో టైప్ 2 డయాబెటిస్ ఉన్న 80 మంది రోగులు పాల్గొన్నారు. ఈ వ్యక్తులు పది వారాల పాటు భోజనం తర్వాత ప్రతిరోజూ 3 గ్రాముల ఏలకులు తినాలని సూచించారు. ఈ అధ్యయనం రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో ఏలకులు ప్రభావవంతంగా ఉంటుందని చూపించింది. డయాబెటిక్ రోగులు భోజనం తర్వాత ప్రతిరోజూ కనీసం 3 గ్రాముల ఏలకులు తినాలి. ఇది రక్తంలో చక్కెరను నియంత్రణలో ఉంచుతుంది.

# గుండె ఆరోగ్యానికి దివ్యౌషధం



ఈ చిన్న పండు అందమైన ఎరుపు రంగులో ఉంటుంది. రాస్ప్బెర్రీస్ నలుపు, ఊదా, పసుపు, బంగారు రంగులలో కూడా వస్తాయి. ఈ పండు విటమిన్లు సి, ఇ లతో సమృద్ధిగా ఉంటుంది. అందుకే, ఇది పరిమాణంలో చిన్నగా ఉన్నప్పటికీ ఇది గణనీయమైన ప్రయోజనాలను అందిస్తుంది. రాస్ప్బెర్రీ ఒక రుచికరమైన పండు మాత్రమే కాదు..దీంతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి. ఆరోగ్యంగా ఉండటానికి మీరు మీ ఆహారంలో వివిధ రకాల పండ్లను చేర్చుకుంటారు. ఆ పండ్ల ప్లేట్‌లో రాస్ప్బెర్రీస్‌కు స్థానం ఉందా? లేకపోతే, వాటిని తప్పకుండా చేర్చుకోండి. ఈ చిన్న పండు అందమైన ఎరుపు రంగులో ఉంటుంది. రాస్ప్బెర్రీస్ నలుపు, ఊదా, పసుపు, బంగారు రంగులలో కూడా వస్తాయి. ఈ పండు విటమిన్లు సి, ఇ లతో సమృద్ధిగా ఉంటుంది. అందుకే, ఇది పరిమాణంలో చిన్నగా ఉన్నప్పటికీ ఇది గణనీయమైన ప్రయోజనాలను అందిస్తుంది. రాస్ప్బెర్రీస్ వివిధ రకాల యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. అవి మెదడు పనితీరును నిర్వహిస్తాయి. మెరుగుపరుస్తాయి. విటమిన్లు ఇ, సి జ్ఞాపకశక్తిని పెంచుతాయి. రాస్ప్బెర్రీస్‌లోని యాంటీఆక్సిడెంట్లు మెదడుకు మాత్రమే కాకుండా గుండెకు కూడా మేలు చేస్తాయి. రాస్ప్బెర్రీస్ సరైన రక్త ప్రసరణను ప్రోత్సహిస్తాయి. రాస్ప్బెర్రీస్ క్రమం తప్పకుండా తినే వ్యక్తులు అధిక రక్తపోటుతో బాధపడే అవకాశం తక్కువ, ఇది గుండె ఆరోగ్యానికి దోహదం చేస్తుంది. రక్తంలో చెడు కొలెస్ట్రాల్ కూడా రాస్బెర్రీలు తగ్గించేస్తాయి. పొటాషియం ఉంటుంది ఇది రక్తపోటును నియంత్రణలో ఉంచుతుంది. రాస్ప్బెర్రీస్ క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడే సమ్మేళనాలను కూడా కలిగి ఉంటాయి. ఈ సమ్మేళనాలు క్యాన్సర్ కణాలను నాశనం చేసే యాంటీఆక్సిడెంట్లు. ఇది ప్రత్యేకంగా కడుపు, రొమ్ము క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. డయాబెటిస్ ఉన్నవారు కూడా రాస్ప్బెర్రీస్ ను హాయిగా తినవచ్చు. బరువు తగ్గడానికి డైటింగ్ చేసేవారు కూడా రాస్ప్బెర్రీస్ తినమని నిపుణులు సలహా ఇస్తారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఎవరిది జనవరి26_ఎవరిది ఆగస్ట్15 ?



ఎవరిది జనవరి, ఎవరిది ఆగస్ట్ ?
ఎవరు సుఖ-సంతోషాలతో
వున్నదిక్కడ?
ఎవరు స్వేచ్ఛవాయువుల్ని
పీలుస్తున్నాదిక్కడ?

దొరున్నాడు,దోపిడీదారుడున్నాడు.
నమ్మించి గొంతుల్ని కోసే
కసాయున్నాడు.
అమ్మనా భూతులింకా తిట్టేవాడున్నాడు
మోహన ఉమ్మేసే ఉన్మాది
ఊరేగుతున్నాడు.

దొంగున్నాడు, లంగున్నాడు.
అబద్ధాలకోరు, హంతకుడున్నాడు
దగకోరు, మోసగాడున్నాడు.
ఎక్కడ టికెట్ దొరికినా, ఎలా దొరికిన
ప్రభుత్వపు గుర్రంపై స్వారీ చేస్తున్నది
వాడే
వాడిదే జనవరి ఇరవై ఆరు
వాడిదే 15 ఆగస్టు.

మిగతా అంత దుఃఖసంద్రంలో
ఇదుతున్నారు
అర్ధకాలితో అలమటిస్తున్నారు.
ఎవరున్నారు వికసించిన పువ్వులవలే
ఇక్కడ?
ఎండిపోయిన ఆకులవలె
అస్థిపంజారాలు ఏళ్ళాడుతుంటే,
దర్జాగా వున్నదెవరు ఇక్కడ
దారిద్రం ఆడని నెత్తులెక్కడ...?
రాజుకే రాజబోగాలన్ని,
వాడిదే హంగు-అర్భటలాన్ని
వాడిదే జనవరి-వాడిదే ఆగస్ట్.

పాట్నా వుంది, ఢిల్లీ వుంది.
జిమ్మిక్కంతా అక్కడే వుంది.
కిక్కిరిసిపోయే జనాల రద్దీ వుంది
బేరసారాల జాతర వుంది.
ఫ్రిజ్ వుంది, సోఫా వుంది
కరెంటు కాంట్రాక్ట్ వుంది
ఫ్యాషన్ మోజు వుంది
ప్రతిదీ బహిర్గతమవుతుంది
వెర్రి జనాల వీపు పైనే బడ్జెట్ మోత
మొగుతుంది.


లెక్కించండయ్యా, లెక్కించండి.
ఈ మాస్టర్ ఛాతీలో గట్టి ఎముకలింక
ఎన్నున్నాయో
కార్మికుని ఛాతీలో విరగని ఎముకలు
ఎన్ని మిగిలున్నాయో
ఆ ఇంటావిడ ఛాతీలో ఎంత గట్టి
ఎముక వుందో
వారి పిల్లల ఛాతీలో నాజూకైనా
ఎముకలెన్నో
ఒక్కొక్కర్ని నిలబెట్టి లెక్కబెట్టండి
లెక్కబెట్టి లెక్కగట్టండి.
పిచ్చి ప్రజల వెన్ను
వెయ్యి టన్నులు బడ్జెట్ మోయడానికే
కదా వుంది.

దూరంగా విసిరేయబడ్డ ఆ
మురికివాడల్లో
వెలివేసిన వాళ్ళు
వెనుకబడిన వాళ్ళు వున్నారు.
కానీ,గుడిసెలు ద్వాంసమౌతున్నాయి
బంగాళాలూ మాత్రం
మెరిసిపోతున్నాయి చూడు.

ధట్ తేరీ,
తియ్యని మాటల్తో కోటలు కట్టడం తప్ప
ఎం ఎలాగబెడ్తారు వాళ్ళు?
మాయమాటలు చెప్పి నోట్లో మట్టి
కొట్టడం తప్ప.
ఎం ఉద్దరిస్తారు?
పాకం లేకుండా చెక్కర పొంగళ్ళు
చేస్తారు
మెల్లిగా వెన్నుకి వెన్న రాసి
కొండంత బడ్జెట్ బరువునేస్తారు.

మరి ఎవరీ జనవరి, ఎవరీ ఆగస్ట్ ఇది??
ఎవరిది సంతోషం, ఎవరిది సుఖం?

చెమటోడ్చే శ్రామికుడిదే కష్టం
యజమానికే లాభం
దోచుకుతినే దొంగే బలుస్తున్నాడు
వాడికి దోచిపెట్టేవాడు ఊడిగం
చేస్తున్నాడు.
మంత్రే మాయగాడిక్కడ
వాడే మస్త్ వుంటాడు
వాడిదే జనవరి, వాడిదే ఆగస్టు.



మూల కవి: బాబా నాగార్జున
తెలుగు స్వేచ్ఛానువాదం:
దియా విఘ్నేష్

# బీజేపీలో చేరిన నిజామాబాద్ వ్యాపారవేత్త అనిల్ యాదవ్

- అర్బన్ నియోజకవర్గం 37వ డివిజన్‌లో రాజకీయ చర్చ
- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన అర్వింద్ ధర్మపురి

నిజామాబాద్, జనవరి 25 (తెలంగాణ ముచ్చట్లు):

నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం 37వ డివిజన్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త అనిల్ యాదవ్ భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఆయన తన తండ్రి రఘు రాములు యాదవ్‌తో పాటు స్నేహితులు, అనుచరులతో కలిసి పార్టీలో చేరడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి అనిల్ యాదవ్‌కు పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ప్రజలతో మమేకమై పనిచేసే వ్యక్తులు పార్టీలోకి రావడం బీజేపీ బలాన్ని మరింత పెంచుతుందని ఆయన పేర్కొన్నారు. రఘు రాములు యాదవ్ విశ్వహిందూ పరిషత్ మాజీ పట్టణ అధ్యక్షులుగా పనిచేసిన నేపథ్యం ఉండటంతో, ఈ చేరికకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. నగరంలో సామాజికంగా, వ్యాపార రంగంలో అనిల్ యాదవ్‌కు ఉన్న గుర్తింపు పార్టీకి ఉపయోగపడుతుందని బీజేపీ నేతలు అభిప్రాయపడ్డారు. నిజామాబాద్ నగర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ విధానాలు నచ్చి పార్టీలో చేరినట్లు అనిల్ యాదవ్ ఈ సందర్భంగా తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.



# మున్సిపల్ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ లక్ష్యం: మంత్రి పొంగులేటి

**అభ్యర్థుల ఎంపికలో ప్రజాభిప్రాయమే తుది నిర్ణయం**
**వారసత్వ రాజకీయాలకు చోటులేదు**
**టికెట్ రాకపోయినా పార్టీనే బలోపేతం చేయాలి**

ఖమ్మం, జనవరి 25 (తెలంగాణ ముచ్చట్లు):

రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ సాధించడమే కాంగ్రెస్ లక్ష్యమని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా ఇల్లెందు, ఏదులాపురం మున్సిపాలిటీల ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని, పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. మున్సిపల్ ఎన్నికల అభ్యర్థుల ఎంపికలో పార్టీ ప్రజాభిప్రాయమే తుది నిర్ణయమని మంత్రి తెలిపారు. పార్టీ పట్ల విధేయత, ప్రజలకు సేవ చేయాలనే తపన ఉన్నవారికే ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. వారసత్వ రాజకీయాలకు తమ పార్టీలో చోటు లేదని, తన రక్త సంబంధీకులకు కూడా టికెట్లు ఇవ్వబోనని స్పష్టంచేశారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో శాస్త్రీయ సర్వేలు నిర్వహిస్తున్నామని తెలిపారు. శివరాత్రి లోపు ఎన్నికలు, కౌంటింగ్, ప్రమాణ స్వీకార కార్యక్రమాలు పూర్తయ్యే అవకాశం ఉందని పేర్కొన్న మంత్రి, సమయం తక్కువగా ఉన్నందున పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఏదులాపురం, ఇల్లెందుల అభివృద్ధికి ఇప్పటికే కోట్ల రూపాయల నిధులు కేటాయించినట్టు తెలిపారు. టికెట్ రాకపోయిన వారు నిరాశ చెందకుండా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని మంత్రి పిలుపునిచ్చారు. అసంతృప్తితో ఇతర పార్టీల వైపు వెళ్లడం రాజకీయ భవిష్యత్తుకు హానికరమని హెచ్చరించారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందని, అధికారంలో ఉన్నందున భవిష్యత్తులో కో-ఆప్షన్ సభ్యులుగా లేదా ప్రభుత్వంలోని ఇతర పదవుల ద్వారా సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. కార్యకర్తలే తన బలమని, వారి కష్టమే తనకు గౌరవమని పేర్కొంటూ, నమ్మకం ఉంచిన వారందరికీ అండగా ఉంటానని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.





# ఫిబ్రవరి రెండో వారంలో మునిసిపల్ ఎన్నికలు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)



ఫిబ్రవరి రెండో వారంలో పురపాలక ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయని, త్వరలో షెడ్యూల్ విడుదలవుతుందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పురపాలక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధిక స్థానాలు గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. మునిసిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం నిజామాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్‌తో కలిసి కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఉత్తమ్ పాల్గొన్నారు. అనంతరం జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో మీడియాతోనూ ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గత రెండేళ్లుగా చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలే రాబోయే మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తాయన్నారు. చేసిన అభివృద్ధి పనులు వివరిస్తూ ముందుకెళ్లాలని, టికెట్ ఎవరికి వచ్చినా అందరూ కలిసి పనిచేస్తే పార్టీ అన్ని మునిసిపాలిటీలను, కార్పొరేషన్‌లను గెలుచుకుంటుందని చెప్పారు. సర్వేల ఆధారంగా అభ్యర్థులకు టికెట్లు ఇస్తామని, పార్టీ గెలుపులో భాగస్వాములైన ప్రతి ఒక్కరికి భవిష్యత్తులో సముచిత స్థానం కల్పిస్తామని పేర్కొన్నారు. ఎక్కడాలేనివిధంగా తెలంగాణలో పేదలకు సన్నబియ్యం అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు.




# ‘విజిల్’తో ఎన్నికల సమరానికి టీవీకే శంఖారావం

- మహాబలీపురం వేదికగా గుర్తు ఆవిష్కరణ
- డీఎంకే–ఏఐఏడీఎంకేలపై విజయ్ తీవ్ర విమర్శలు
- 2026 ఎన్నికలు ప్రజాస్వామ్య యుద్ధమేనని వ్యాఖ్య

తమిళనాడు రాజకీయాల్లో తనదైన ముద్ర వేయడానికి సిద్ధమైన ప్రముఖ నటుడు విజయ్ తన పార్టీ తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఎన్నికల గుర్తుగా ‘విజిల్’ను ఆవిష్కరించారు. 2026 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా అధికార డీఎంకే, ప్రతిపక్ష ఏఐఏడీఎంకేలపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. చెన్నై సమీపంలోని మహాబలీపురంలో ఆదివారం నిర్వహించిన భారీ కార్యకర్తల సమావేశంలో ఈ గుర్తును అధికారికంగా ప్రకటించారు. వేదికపై స్వయంగా విజిల్ ఊదుతూ రాబోయే ఎన్నికల సమరానికి సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు విజయ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రస్తుత డీఎంకే పాలనను ‘దుష్ట శక్తి’గా, గత ఏఐఏడీఎంకే ప్రభుత్వాన్ని ‘అవినీతి శక్తి’గా అభివర్ణించారు. ఈ రెండు శక్తులు తమిళనాడును పాలించడానికి అర్హాలు కావని, వాటిని ఎదుర్కొనే ధైర్యం టీవీకేకు మాత్రమే ఉందని స్పష్టం చేశారు. డీఎంకే, ఏఐఏడీఎంకే రెండు ద్రావిడ పార్టీలు బీజేపీకి లొంగిపోయాయని విజయ్ ఆరోపించారు. ఏఐఏడీఎంకే బహిరంగంగా లొంగిపోతే, డీఎంకే పరోక్షంగా లొంగిపోయిందని విమర్శించారు. “మేము ఎవరి ఒత్తిడికీ తలొగ్గం. ఈ ముఖం చూస్తే ఒత్తిడికి లొంగేలా ఉందా?” అంటూ ప్రశ్నించి కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. 2026 ఎన్నికలు కేవలం ఎన్నికలు మాత్రమే కాదని, అవి ఒక ప్రజాస్వామ్య యుద్ధమని విజయ్ వ్యాఖ్యానించారు. ఈ యుద్ధంలో కార్యకర్తలే నాయకులు, కమాండర్లు అని పేర్కొన్నారు. సినిమా రంగంలో ఉన్నత స్థాయిలో ఉన్నప్పుడే ప్రజల కోసం రాజకీయాల్లోకి వచ్చానని, ప్రజలను, ఈ నేలను కాపాడటమే తన లక్ష్యమని ఆయన ఉద్ఘాటించారు. ఇదిలా ఉండగా, ఇటీవల భారత ఎన్నికల కమిషన్ టీవీకేకు ‘విసిల్’ గుర్తును కేటాయించిన విషయం తెలిసిందే.

# అమెరికా కాంగ్రెస్ ప్రతినిధులతో జైశంకర్ కీలక భేటీ

- భారత్–అమెరికా ద్వైపాక్షిక సంబంధాలపై చర్చ
- ఇండో–పసిఫిక్, ఉక్రెయిన్ పరిణామాలపై సమాలోచన
- కాంగ్రెషనల్ పరస్పర చర్యలకు ప్రాధాన్యం



భారత్-అమెరికా సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అమెరికా కాంగ్రెస్ ప్రతినిధి బృందంతో కీలక భేటీ నిర్వహించారు. ఈ సమావేశంలో అమెరికా ప్రతినిధులు మైక్ రోజర్స్, ఆడమ్ స్మిత్, జిమ్మీ ప్యాట్రోనిస్ తో పాటు భారతదేశంలోని అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత్-అమెరికా ద్వైపాక్షిక సంబంధాలకు సంబంధించిన వివిధ అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు జైశంకర్ తెలిపారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో వ్యూహాత్మక పరిస్థితులు, అంతర్జాతీయ భద్రతా అంశాలు, ఉక్రెయిన్ సంఘర్షణ వల్ల ఏర్పడిన ప్రపంచ రాజకీయ పరిణామాలపై అభిప్రాయాల మార్పిడి జరిగినట్లు వెల్లడించారు. భారత్-అమెరికా భాగస్వామ్యంలో కాంగ్రెషనల్ పరస్పర చర్యలు ఎప్పటినుంచో కీలక పాత్ర పోషిస్తున్నాయని జైశంకర్ పేర్కొన్నారు. శాసనసభ్యుల స్థాయిలో జరిగే చర్చలు ద్వైపాక్షిక సంబంధాలను మరింత లోతుగా తీసుకెళ్లడంలో సహకరిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రపంచ రాజకీయాల్లో వేగంగా మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో భారత్-అమెరికా మధ్య సమన్వయం, పరస్పర అవగాహన మరింత అవసరమని ఈ భేటీ స్పష్టం చేస్తోందని దౌత్య వర్గాలు పేర్కొన్నాయి. భవిష్యత్తులో కూడా ఇలాంటి ఉన్నతస్థాయి పరస్పర సమావేశాలు కొనసాగుతాయని వారు తెలిపారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in